ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ జిల్లా వార్తలు
శుక్రవారం 18 ఏప్రిల్ 2025 | 5



కాకినాడ ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.6
కనిష్ఠం : 24.6



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

సరళం, సులభం, సత్వర న్యాయం
ప్లాపస్



- తెల్ల కాగితంపై ఫిర్యాదు రాసిస్తే చాలు
- విద్యుత్, తాగునీరు, వీధి దీపాలు, రవాణా, వైద్యం, విద్య ఇబ్బందులపై ఆధారాలు, మెరిట్స్ ప్రకారం తీర్పు 6
- న్యాయవాది అవసరం లేదు
- కోర్టు ఫీజు ఉండదు
- తీర్పుపై అప్పీలుకు అవకాశం లేదు
- కార్యాలయాల చుట్టూ తిరగక్కర్లేదు

'అనంత'పాపాలు పండేనా?
- వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ హత్య కేసులో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదిగా ముప్పాళ్ల నియామకం 6

ముగిసిన ఏపీపీఎస్ రేంజ్-1 క్రీడా పోటీలు 6

క్రీడలతో మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం: ఎస్పీ 7

ఉన్నతమైన ఆలోచనలు జీవితాన్ని మారుస్తాయి కలెక్టర్ షాన్‌మోహన్

20న క్రికెట్ ఎంపికలు 6

20 వరకు రేషన్‌లో బియ్యం 6



హాలోవిన్ ప్రదర్శన చేసిన కాకినాడ జగన్నాథపురం నేతాజీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో సిటీ ఎమ్మెల్యే కొండబాబు

గురుకులాలు.. గాలికే!



కోట్లు ఊడ్చేసి.. కాంట్రాక్టు కంపెనీ కక్కుర్తి పనులు

సమస్యల మధ్యే చదువు సా..గుతోంది.. అయినా అటువైపు కన్నెత్తి చూసేవారే లేరు.. కనీసం పట్టించుకునేవారు కానరావడంలేదు.. నిధులు ఏమైనా లేవా అంటే అదీ కాదు.. కనీస పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా మారిపోయింది.. కోట్లు తీసుకున్నా.. కక్కుర్తి పనులు చేస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు.. ఇదీ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 21 అంబేడ్కర్ గురుకుల వసతి గృహాల్లో దుస్థితి.. కలుషిత నీళ్లు తాగుతూ.. అపరిశుభ్ర వాతావరణం మధ్య వేలాది మంది విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారు. కాంట్రాక్టు శానిటేషన్ కంపెనీ నిధులు మింగేసి నిర్వహణ గాలికొదిలేయడంతో సమస్యల మధ్యే చదువు సాగిస్తున్నారు. ప్రిన్సిపాళ్లు సైతం సదరు కంపెనీపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా తీరు మార్చుకోవడం లేదు.

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

కోట్లాది రూపాయల మేర నిధులిస్తున్నారు.. చుట్టూ పెద్దఎత్తున అధికార యంత్రాంగం ఉంది. అయితే ఏం లాభం.. కనీసం అక్కడ ఏం జరుగుతుందో చూసే వారే కరువయ్యారు. విద్యార్థులు సమస్యల మధ్యే వసతి పొందుతున్నా పరిష్కరించే నాథులే కరువయ్యారు. ఇదెక్కడో కాదు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల వసతిగృహాల్లో దుస్థితి. ఆ వసతి గృహాల్లో మంచినీటి ట్యాంకులు, ఆర్వో ప్లాంట్లను పరిశుభ్రంగా ఉంచాల్సిన కాంట్రాక్టర్ గాలి కొదిలేయడంతో విద్యార్థులకు కలుషిత నీరే దిక్కుగా మారింది. అటు వందల సంఖ్యలో ఉండే విద్యార్థుల హాస్టళ్లలో ఎప్పటికప్పుడు సెప్టిక్ ట్యాంకులు క్లీన్ చేయాల్సి ఉన్నా అదీ చేయడం లేదు. డ్రైనేజీ నిర్వహణ పట్టించు కోవడం లేదు. హాస్టల్ పరిసరాలను గాలికొదిలేశారు. గత వైసీపీ ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతో టెండరు దక్కించుకున్న తెలంగాణకు చెందిన ఈ కంపెనీ ప్రభుత్వం మారినా అదే అరాచకం కొనసాగిస్తోంది. అటు విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఉమ్మడి జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలు సాంఘిక సంక్షేమశాఖ మంత్రికి లేఖలు రాసినా కాంట్రాక్టర్ ఖాతరు ఏమాత్రం చేయడం లేదు. సదరు బిల్లులు భారీగా బొక్కేస్తూ స్థానికంగా ఓ ఇద్దరు తాత్కాలిక ప్రైవేటు ఉద్యోగులకు హాస్టళ్లను సబ్ కాంట్రాక్టుకు ఇచ్చేసి తన బాధ్యతను వదిలేశాడు.

నలుగురు ఎమ్మెల్యేలు చెప్పినా..

ఉమ్మడి జిల్లాలో అంబేడ్కర్ గురుకుల వసతిగృహాల్లో శానిటేషన్ కంపెనీ నిర్లక్ష్యంపై ఆయా ప్రిన్సిపాళ్లు ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. ప్రభుత్వం మారినా కంపెనీ వైఖరి ఏమాత్రం మారలేదని నివేదికలో వివరించారు. మొత్తం 15 అంశాల్లో కంపెనీ కనీసం ఆరు అంశాల్లో కూడా పారిశుధ్య నిర్వహణ పాటించడం లేదని రిమార్కులతో నివేదికలు పంపారు. వీటిని పరిశీలించి సరిదిద్దాల్సిన జిల్లా కోఆర్డినేటర్ సైతం కంపెనీపై చర్యలు తీసుకునేలా పైఅధికారులకు సిఫార్సులు చేయలేదు. మరోపక్క ఈ వసతి గృహాల్లో శానిటేషన్ ఘోరంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కొంతకాలం కిందట స్థానిక ఎమ్మెల్యేలకు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో నలుగురు ఎమ్మెల్యేలు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి నేరుగా లేఖలో ఫిర్యాదు చేశారు. అయినా కంపెనీ మాత్రం తన తీరు మార్చుకోలేదు.

13 వేల మంది విద్యార్థులు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో 21 చోట్ల అంబేడ్కర్ గురుకుల వసతి గృహాలు ఉన్నాయి. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఎస్సీ విద్యార్థులకు విద్యాభ్యాసంతోపాటు వసతి అందిస్తారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఒక్కో వసతి గృహంలో 640 మంది విద్యార్థుల చొప్పున మొత్తం 13 వేల మంది ఉంటున్నారు. గురుకులాల్లో పూర్తి పరిశుభ్ర వాతావరణంలో చదు వు,వసతి ఉండేలా ప్రభుత్వం నిధులు వెచ్చిస్తోంది. పారిశుధ్య నిర్వహణకు కాంట్రాక్టర్‌ను నియమించి నెలకు కోట్లలో బిల్లులు చెల్లిస్తోంది. శానిటేషన్ కాంట్రాక్టు పొందిన కంపెనీ ప్రతి వసతి గృహానికి సిబ్బందిని నియమించి యూనిఫాం ఇచ్చి పనులు చేయించాలి. గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు అనుకూలంగా ఉండడంతో ఎక్కడికక్కడ స్థానికంగా ఓ మనిషిని పురమాయించి వారితో అరకొర పనులు చేయిస్తూ నెట్టుకొచ్చింది. ప్రభుత్వం మారిన తర్వాత కూడా సదరు కంపెనీ అదే నిర్లక్ష్యం కొనసాగిస్తోంది. వసతి గృహం ఉన్న ప్రాంతంలో ఓ పనిమనిషికి రూ.5 వేల వరకు ఇచ్చి తూతూమంత్రంగా పనులు చేయిస్తోంది. కంపెనీ కోట్లలో దండుకుంటోంది.

గతేడాదే గడువు ముగిసినా..

గతేడాదే ఈ కంపెనీకి టెండరు గడువు పూర్తయింది. కానీ గత వైసీపీ పెద్దలు మాత్రం పనితీరు ఏమాత్రం బాగోలేని కంపెనీకి దాసోహమయ్యారు. తిరిగి మరో ఏడాది కాంట్రాక్టు పొడిగిస్తూ గతేడాది అడ్డగోలుగా నిర్ణయం తీసుకున్నారు. ఫలితంగా ఇప్పటికీ ఈ సంస్థ సేవలనే ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోంది. అధికారులు సైతం రాష్ట్ర ప్రభుత్వం మారిన నేపథ్యంలో కంపెనీ నిర్లక్ష్యపు సేవలపై కనీసం సమీక్షించలేదు. మరోపక్క గురుకుల వసతి గృహాల్లో అప్పనంగా కోట్లలో డబ్బు బిల్లుల రూపంలో వస్తుండడంతో త్వరలో ముగిసిపోనున్న కాంట్రాక్టును మళ్లీ పొడిగించేందుకు సదరు కంపెనీ రాజకీయంగా పావులు కదుపుతోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం టెండర్లు పిలిచినా మళ్లీ తామే కొనసాగేలా తెరవెనుక మంత్రాంగం నడుపుతోంది.

విద్యార్థులకు కలుషిత నీరే తాగునీరు..

ఉమ్మడి జిల్లాలో 21 వసతిగృహాల శానిటేషన్ కాంట్రాక్టును గత వైసీపీ ప్రభుత్వం తన అనుకూలంగా ఉండే తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా హన్మకొండకు చెందిన కృష్ణ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి 2023లో ఇచ్చింది. సదరు కంపెనీ కొద్దినెలలు మినహా ఆ తర్వాత పారిశుధ్య నిర్వహణ గాలికొదిలేసింది. నిబంధనల ప్రకారం ఈ కంపెనీ ఆయా హాస్టళ్లలో సిబ్బందిని నియమించుకుని పారిశుధ్య నిర్వహణ చేపట్టాలి. మూడు నెలలకోసారి ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రం చేసి మంచినీరందించాలి. అయితే ఏడాదిన్నరగా పూర్తిగా గాలికొదిలేసింది. హాస్టళ్లలో ఆర్వో వాటర్ ప్లాంట్లను ఎప్పటికప్పుడు క్లీన్ చేయాల్సి ఉన్నా చేయడం లేదు. దీంతో విద్యార్థులు కలుషిత నీటినే తాగుతున్నారు. కొన్నిచోట్ల ఇవి పాడైపోవడంతో బోరు నీరు తాగాల్సిన పరిస్థితి. వేలాది మంది విద్యార్థులు ఉండే హాస్టళ్లలో సెప్టిక్ ట్యాంకులను తరచూ శుభ్రం చేయించాలి.కానీ ఏడాదిన్నరగా పట్టించుకోవడం మానేసింది. దీంతో విద్యార్థులు దుర్వాసన మధ్యే వసతి పొందాల్సి వస్తోంది. హాస్టళ్లలో డ్రైనేజీ, ఇతర కాలువల్లో వ్యర్థాలు, ఇతర ఆహారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నా సదరు కంపెనీ పట్టించుకోవడం లేదు. హాస్టళ్లన్నీ అపరిశుభ్ర వాతావరణంలో ఉంటున్నాయి. కానీ నెలనెలా మాత్రం ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయల బిల్లులు దండేసుకుంటోంది.

- అంబేడ్కర్ గురుకులాల్లో ఘోరం
- శానిటేషన్ నిర్వహణ గాలికి
- అపరిశుభ్రంగా వసతి గృహాలు
- గత వైసీపీ హయాంలో కాంట్రాక్టు
- నలుగురు ఎమ్మెల్యేల ఫిర్యాదు
- వసతిగృహాల ప్రిన్సిపాళ్లు నివేదికలు
- ఖాతరు చేయని కాంట్రాక్టు కంపెనీ
- మళ్లీ కాంట్రాక్టు పొడిగింపుపై కన్ను



పిల్లలకు సంస్కారం ఎంతో ముఖ్యం

- రాష్ట్ర ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



చాగంటిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు, కుడా చైర్మన్ తుమ్మల బాబు, ఎమ్మెల్సీ పద్మశ్రీ

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో పిల్లలకు చదువు కంటే సంస్కారం ముఖ్యమని ప్రముఖ ప్రవచనకర్త, రాష్ట్ర ప్రభుత్వ నైతికవిలువల సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కాకినాడ ఆనందభారతి నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో గురువారం అర్బన్ మండల స్థాయి పాఠశాలల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చాగంటి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తల్లిదండ్రులను, గురువులను గౌరవించేలా పిల్లల్ని తీర్చిదిద్దాలన్నారు. ప్రస్తుత సమాజంలో చదువుతోపాటు నైతిక విలువలు అవసరమన్నారు. అబ్దుల్ కలాం, లాల్‌బహదూర్‌శాస్త్రి వంటి గొప్ప వ్యక్తులు తమ తల్లిదండ్రులకు, గురువులకు కీర్తి తెచ్చేలా ప్రవర్తించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎందరో ప్రస్తుతం ఉన్నత స్థితిలో ఉన్నారన్నారు. పిల్లలను బడికి పంపేందుకు ఉదయమే లేచి కష్టపడుతున్న తల్లిదండ్రులను సత్కరించాలన్నారు. సంస్కారం నేర్పే విద్యే నిజమైన విద్యని, పిల్లలను ఉత్తమ విలువలు కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని అన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు కూటమి ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేస్తున్న కృషిని తెలిపారు. అనంతరం పలువురు విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించగా విజేతలుగా నిలిచినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాకినాడసిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, పాఠశాల విద్య ఆర్జేడీ నాగమణి, డీఈవో రమేష్, కుడా చైర్మన్ రామస్వామి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినిని సత్కరించిన జిల్లా కలెక్టర్



జిల్లా ప్రథమస్థానం సాధించిన విద్యార్థిని సాయిజ్యోతిని సత్కరిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని జ్యోతుల సాయిజ్యోతిని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో 983 మార్కులు సాధించిన కాకినాడ జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటిస్థానం సాధించిన సందర్భంగా కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం ఆమెను సత్కరించి రూ.పదివేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మో హన్ మాట్లాడుతూ ఇదే పట్టుదలతో ఉన్నతచదువులు అభ్యసించి మంచిస్థానానికి చేరుకోవాలన్నారు. సాయిజ్యోతి చదువుకోవడానికి చక్కటి ప్రోత్సాహాన్ని అందించిన తల్లిదండ్రులను, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందు, తల్లిదండ్రులు సత్తిబాబు, పార్వతి పాల్గొన్నారు.

ఏఎంవో ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న అకడమిక్ మోనిటరింగ్ అధికారి(ఏఎంవో) ఉద్యోగానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అదనపు పథక సమన్వయకర్త(ఏపీసీ) పి.వేణుగోపాలరావు తెలిపారు. ప్రభుత్వ, జడ్పీ, మున్సిపాల్టీ యాజమాన్యాల్లో పనిచేస్తున్న 8ఏళ్ల సర్వీస్ నిండి పీజీలో స్కూల్ సబ్జెక్టులు, 55ఏళ్ల లోపు వయస్సుగల స్కూల్ అసిస్టెంట్లు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగల ఉపాధ్యాయులు ఈనెల 22న సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తులను జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో సమర్పించాలన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నింపాలి

- సీఎస్ ఆదేశాలు

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నింపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. గురువారం ఆయన అమరావతి సచివాలయ సీఎస్ కాన్ఫరెన్స్‌హాల్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. దీనికి కాకినాడ కలెక్టరేట్‌నుంచి కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్, వివిధశాఖల జిల్లాస్థాయి అధికారులతో కలిసి హాజరయ్యారు. ఉచిత ఇసుక సరఫరా, సోలార్‌ప్రాజెక్టులకు భూసేకరణ, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల ఫిల్లింగ్‌కు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక, తాగునీటి సరఫరా, ఎంఎస్‌ఎంఈల పార్కుల ఏర్పాటు, స్వర్ణఆంధ్ర-స్వచ్ఛఆంధ్ర అంశాలపై సీఎస్ చర్చించారు. డీపీవో రవికుమార్, జడ్పీ సీఈవో లక్ష్మణరావు పాల్గొన్నారు.

హమ్మయ్య తగ్గాయి!

- అందుబాటులో కూరగాయల ధరలు
- రైతుబజార్లలో ఉల్లి కిలో రూ.20, వంకాయలు కిలో రూ.16



కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 17(ఆంధ్ర జ్యోతి): ఎట్టకేలకు కూరగాయల ధరలు అందుబాటులోకి వచ్చాయి. సామాన్యులు కూడా కొనుగోలు చేసే స్థాయికి కూరగాయల ధరలు తగ్గాయి. ఎప్పుడు కిలో రూ.50 తగ్గని బీరకాయలు ధర కూడా తగ్గింది. ఉల్లిపాయల ధరలు కూడా గణనీయంగా పడిపోయాయి.

రైతుబజార్లతో పోల్చితే బహిరంగ మార్కెట్ లో కూరగాయల ధరలు కాస్త ఎక్కువ అనిపించినా అక్కడ కూడా స్వల్ప తేడాతోనే లభిస్తాయి. దీంతో కూరగాయల ధరల విషయంలో సామాన్యులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు లేకపోవడం, అన్‌సీజన్ కావడంతో వినియోగం భారీగా తగ్గింది. దీంతో దిగుబడికి సరిపడా డిమాండ్ లేక ధరలు దిగివచ్చా యి. నిజానికి కొద్దిరోజులుగా కూరగాయల ధర లు నేలచూపులు చూస్తున్నాయి. బెండకాయ, దొండకాయ, వంకాయల ధరలైతే మరీ పతనమయ్యాయి. రైతుబజార్లలో గత మార్చి నెలలో వంకాయ కిలో రూ.34 ఉంటే ప్రస్తుతం కిలో రూ.16 నుంచి రూ.20 ఉంది. దొండకాయ కిలో రూ.36 ఉంటే ప్రస్తుతం కిలో రూ.14మాత్రమే ఉంది. బెండకాయ రూ.40 ఉంటే ప్రస్తుతం కిలో రూ.20 మాత్రమే.

పిఠాపురం మండలం గొల్లప్రోలు, తాటిపర్తి, విరవ, విరవాడ, మంగితుర్తి, కోలంక, పెద్దాపురం మండలం దివిలి ప్రాంతాలనుంచి కూడా మార్కెట్లకు పెద్దఎత్తున కూరగాయలు వస్తున్నా యి. దీంతోపాటు శంఖవరం, రౌతులపూడి, తుని మండలాల నుంచి కూరగాయలు దిగుబ డి పెరిగింది. రైతుబజార్లలో బీరకాయలు కిలో రూ.54 ఉంటే ప్రస్తుతం రూ.35. పచ్చిమిర్చి రూ.40 నుంచి రూ.44 ఉంటే ప్రస్తుతం కిలో రూ.32 నుంచి రూ.35, కాకరకాయ కిలో రూ.35 ఉంటే ప్రస్తుతం రూ.26కే, బంగాళదుంప కిలో రూ.30 ఉంటే ప్రస్తుతం రూ.20 నుంచి రూ.23కే, చిక్కుళ్లు రూ.56 ఉంటే ప్రస్తుతం రూ.26కే విక్రయిస్తున్నారు. ఇక బయటి ప్రాంతాలనుంచి హోల్‌సేల్ వ్యాపారులు కూరగాయలను పెద్దఎత్తున రప్పిస్తున్నారు. ఇది కూడా ధరలు తగ్గడానికి ఒక కారణం. ధరల తగ్గుదల పరిస్థితి గత 15 రోజుల నుంచి ఇలాగే ఉంది. మరో 15, 20 రోజులు ఇలానే ఉండొచ్చని అధికారులు చెప్తున్నారు.

రేపు స్వచ్ఛాంధ్రా- స్వర్ణాంధ్ర కార్యక్రమం: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 19న ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో స్వచ్ఛాంధ్రా- స్వర్ణాంధ్ర కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంనుంచి స్వచ్ఛాంధ్రా-స్వర్ణాంధ్ర కార్యక్రమంపై జిల్లా అధికారులు, రెవెన్యూఅధికారులు, మండల అభివృద్ధి అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ ప్రతినెలా 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం ప్రజలందరికీ తెలిసేలా టాంటాం, మైక్ అనౌన్స్‌మెంట్‌లు చేయించి శనివారం ఏ కార్యక్రమం ఏ ప్రదేశాల్లో నిర్వహిస్తామో తెలియజేసి అందరూ పాల్గొనేలా చూడాలన్నారు. ఈ-వేస్టుకు స్టాల్ ద్వారా సేకరణ చేస్తున్నట్లు ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో శుభ్రపరచడం చేయాలన్నారు. కంప్యూటర్ సిస్టమ్, ప్రింటర్, టేబుల్స్, ఫైల్స్ చక్కగా సర్దుకోవాలన్నారు. ఈ-వేస్టుకు సంబంధించిన పోస్టర్‌ను జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసి అందరికీ అవగాహన కల్పించాలన్నారు. కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ వసతిగృహాలు, పరిశ్రమలు, ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్ యార్డు, రైతుబజార్లు, దేవాలయాలు, ప్రజలు సంచరించేప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

తునిలో యువకుడి అనుమానాస్పద మృతి 7

అంగన్‌వాడీ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంగన్‌వాడీ ప్రీ స్కూల్లో ఉన్న చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో మొదటి తరగతిలో చేర్పించే కార్యక్రమం నూరుశాతం పూర్తి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించే ప్రక్రియకు సంబంధించి గురువారం కలెక్టర్, ఐసీడీఎస్, పాఠశాల విద్యాశాఖ, పంచాయతీ మున్సిపల్ కార్పొరేషన్ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ జిల్లాలో అంగన్‌వాడీ ప్రీస్కూళ్లలోఉన్న 5,424మంది చిన్నారులకుగాను 1,765మందిని మాత్రమే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టిపెట్టి ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. 0-6ఏళ్లలోపు చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియకు క్యాంపులు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి రమేష్, ఐసీడీఎస్ పీడీ విజయకుమారి, డీపీవో రవికుమార్, ఎడీసీ సుధాకర్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జి జేడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

ఎస్పీ ఆధ్వర్యంలో నాకాబందీ

కాకినాడ క్రైం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నాకాబందీతోపాటు డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. పిఠాపురం,కాకినాడ ప్రాంతాల్లోను, జిల్లావ్యాప్తంగా అన్ని ప్రధాన రహదారుల ముఖ్యకూడళ్లలో నాకాబందీ నిర్వహించారు. పిఠాపురం, కాకినాడలోని అన్నమ్మఘాటీ, కుంభాభిషేకం, సర్పవరం, అచ్చంపేట జంక్షన్, కోరింగ, పెద్దాపురం, గండేపల్లి, కత్తిపూడి, తుని తదితర ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ చేసి రికార్డులు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినవారిపై కేసులు నమోదుచేశారు. కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్, పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, ట్రాఫిక్ సీఐలు పాల్గొన్నారు.

రేపు తునిలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 19న తునిలోని పెంటకోట రోడ్‌లో ఉన్న ఆర్‌వీవీఎస్‌జేఆర్‌బీ జడ్పీపీ గరల్స్ హైస్కూల్‌లో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ మేళాలో పలు ప్రైవేట్ కంపెనీలకు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో, బీటెక్, బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఎంఎస్‌సీ ఉత్తీర్ణులైన 30ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.13వేలనుంచి రూ.20వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, రవాణా సౌకర్యం ఉంటుందన్నారు. అభ్యర్థులు శనివారం 9గంటలకు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 77993 76111 నెంబర్లో సంప్రదించాలని తెలిపారు.

1083 లీటర్ల సారా స్వాధీనం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించిన తర్వాత మార్చి, ఏప్రిల్ రెండునెలల్లో జిల్లాలో ఇప్పటివరకు 285 కేసులు నమోదు చేసి 1083 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి 190మంది వ్యక్తులను అరెస్టు చేయడంతో పాటు 93,050లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశామన్నారు. 273 లీటర్ల మద్యాన్ని, 1640 కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటికి సంబంధించి 303 మంది నిందితులను, 39మంది బెల్లం వర్తకులను బైండోవర్ చేశామన్నారు. బైండోవర్ ఉల్లంఘించిన వారినుంచి రూ.లక్షా 80వేలు కట్టించామన్నారు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్‌శాఖల సహకారంతో సారానిర్మూలనకు కృషి చేస్తున్నామన్నారు.



పాపాలకు ప్రాయశ్చిత్తం.. లోకానికి వెలుగు మార్గం!

- పవిత్ర దినం పరిశుద్ధ శుక్రవారం
- చర్చిల్లో గుడ్‌ఫ్రైడే ఆరాధనలు
- క్రైస్తవులంతా భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు
- ఏసుక్రీస్తు పలికిన ఏడు మాటలే శిరోధార్యం

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): యేసు క్రీస్తు సిలువ వేసిన సందర్భాన్ని, ఆయన మరణాన్ని గుర్తుచేసుకునే రోజునే క్రైస్తవులు పవిత్రదినంగా భావిస్తారు. దీన్నే గుడ్‌ ఫ్రైడే, పవిత్ర శుక్రవారం, బ్లాక్‌ ఫ్రైడే, హోలీ ఫ్రైడే, గ్రేట్‌ ఫ్రైడే, గ్రేట్‌ అండ్‌ హోలీ ఫ్రైడే, లేదా లార్డ్‌ పాషన్‌ ఫ్రైడే అని కూడా పిలుస్తారు. మానవాళిచేసిన పాపాల కోసం ప్రాయశ్చిత్తంగా తన ప్రాణాలను ఏసుక్రీస్తు అర్పించాడని క్రైస్తవులంతా భావిస్తారు. ఆయనను శిలువకు వేలాడదీసిన రోజే పవిత్ర శుక్రవారంగా భావించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. నిజానికిది బాధతో కూడిన రోజు కావడంతో ఎంతో భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడేను జరుపుకోవడం చేస్తారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ జిల్లాలో రామారావుపేట, గాంధీనగర్‌, జగన్నాథపురం ప్రాంతాల్లోని పురాతన చర్చిలు, అంబేడ్కర్‌ కోనసీమ జిల్లాలో అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు ప్రాంతాల్లో చర్చిల్లో, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పురాతన చర్చిల్లో క్రైస్తవులంతా శుక్రవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు చర్చిల్లో ఆరాధనలు చేస్తారు. క్రైస్తవులంతా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సిలువలో ఏసుక్రీస్తు పలికిన ఏడు మాటలు ధ్యానిస్తారు. ఈస్టర్‌ ఆదివారం ముందు వచ్చే శుక్రవారం రోజును క్రైస్తవులు పాపాలకు ప్రాయశ్చిత్త ంగా ఏసుక్రీస్తు సిలువ మరణాన్ని జ్ఞాపకం చేసుకుంటారు. అలాగే ఏసు మరణానికి, ఆయన పునరుత్థానానికి మధ్య ఉన్న మూడు రోజులను పవిత్ర దినాలుగా భావిస్తారు. గుడ్‌ఫ్రైడే ఆరాధన.. అందరి పాపాల కోసం తన జీవితాన్ని త్యాగం చేయడం ద్వారా ఏసుక్రీస్తు అందరి కోసం అనుభవించిన బాధలను ప్రతిబింబించమని ఆహ్వానిస్తుంది. గుడ్‌ఫ్రై డే రోజున ప్రాయశ్చిత్తం, ప్రార్థనలు మాత్రమే చేసుకునే రోజు. ముఖ్యంగా ఈరోజు చర్చిల్లో గంటలు మోగించకూడదు. క్రైస్తవ ధర్మం పాటించేవారు మాంసాహారం తినరు. ఉపవాసం చేస్తారు. శిలువ వేసిన గుర్తుగా కొయ్యతో చేసిన శిలువలను ధరించి చర్చిల్లో ప్రార్థిస్తారు. అలా గే శిలువ కొయ్యలతో ప్రదర్శనగానూ నిర్వహిస్తారు. కొన్నిచోట్ల నల్లటి వస్త్రాలు ధరించి క్రీస్తును స్మరిస్తూ ముందుకు సాగుతారు. గుడ్‌ఫ్రైడే ప్రతి ఏటా తేదీ మారుతుంది. మూన్‌ క్యాలెండర్‌ ప్రకారం ఈస్టర్‌ ముందు వచ్చే శుక్రవారాన్ని గుడ్‌ఫ్రైడేగా చేసుకుంటారు. దీంతో లెంట్‌ డేస్‌ పూర్తవుతాయి. గుడ్‌ఫ్రైడే రోజు ఏసును శిలువ వేస్తే.. ఆదివారం పునరుత్థానం చెందాడని ఈస్టర్‌ పండుగ చేస్తారు.

యేసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలు

1. తండ్రి వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుకు వీరిని క్షమించుము. లుకా 23.34
2. నేడు నీవు నాతో కూడా పరదైసులో ఉందువు. లుకా 23.43
3. అమ్మా, ఇదిగో నీ కుమారుడు. ఇదిగో నీ తల్లి. యోహాను 19:26,27
4. నా దేవా, నా దేవా నన్నెందుకు చెయ్యి విడిచితివి. మత్తయి 27:46
5. నేను దప్పిగొని యున్నాను. యోహాను 19:28
6. సమాప్తమైనది. యోహాను 19:30
7. తండ్రి నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనియున్నాను. లుకా 23:46

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ నెల 20వ తేదీ వరకు


రేషన్‌లో బియ్యం

కలెక్టరేట్‌ (కాకినాడ), ఏప్రిల్‌ 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ చౌక ధరల దుకాణాల్లో ఈ నెల 20వ తేదీ వరకు సరుకులు పంపిణీ చేయనున్నారు. ఈ నెల 17వ తేదీతో రేషన్‌లో బియ్యం, పంచదార పంపిణీ గడువు ముగిసింది. అయితే లబ్ధిదారుల సౌకర్యార్థం గడువు మరో మూడు రోజులు పెంచారు. ఇప్పటి వరకు తూర్పుగోదావరి జిల్లాలో 5,64,994 రేషన్‌ కార్డుదారులకు గాను 5,19,660 మందికి రేషన్‌ సరుకుల పంపిణీ జరిగింది. అంటే 91.67 శాతం పంపిణీ నమోదు అయింది. అలాగే కాకినాడ జిల్లాలో 6,33,874 రేషన్‌ కార్డుదారులకు 5,80,432 కార్డుదారులకు పంపిణీ చేశారు. అంటే 90.14 శాతం రేషన్‌ పంపిణీ చేశారు. డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లాలో 5,37,902 రేషన్‌ కార్డుదారులకు 4,81,484 రేషన్‌ కార్డుదారులకు పంపిణీ చేశారు. ఇక్కడ 89.51 శాతం పంపిణీగా నమోదైంది. ఈ నేపథ్యంలో మరో మూడు రోజులు గడువు పెంచి నూరు శాతం లబ్ధిదారులకు బియ్యం, పంచదార పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యం ప్రతి ఒక్క లబ్ధిదారుని ఇంటికి చేరుకోవాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది.

20న క్రికెట్‌ ఎంపికలు

కార్పొరేషన్‌ (కాకినాడ), ఏప్రిల్‌ 17 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా క్రికెట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి పురుషులు అండర్‌-23, సీనియర్స్‌ ఎంపికలు జరుగుతున్నాయని జిల్లా సెక్రటరీ పి.సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 20న ఉదయం 9 గంటలకు కాకినాడ రంగరాయ మెడికల్‌ కాలేజ్‌ క్రికెట్‌ గ్రౌండ్‌లో జరిగే ఎంపికలకు హాజరుకావాలని కోరారు. అండర్‌-23 పురుషులు కచ్చితంగా 2002 సెప్టెంబరు 1లోపు జన్మించి ఉండాలి. ఎంపికలకు హాజరయ్యే పురుషులు తప్పనిసరిగా తెల్లని దుస్తులు, బూట్లు, సొంత కిట్టు తీసుకురావాలి. జన్మదిన పత్రం, ఆధార్‌ కార్డు, స్కూల్‌ నుంచి టెన్త్‌ క్లాస్‌ మార్క్స్‌ సర్టిఫికెట్‌ తీసుకురావాలి.

రక్తంతో ఏసుక్రీస్తు చిత్రం





చిత్రాన్ని వేసిన మందపల్లి శ్రీచరణ్‌

మండపేట శ్రీసత్య డ్రాయింగ్‌ అకాడమీ విద్యార్థి మందపల్లి శ్రీచరణ్‌ ఏసుక్రీస్తు పట్ల తన ఆరాధనా భావాన్ని ప్రత్యేక కోణంలో వ్యక్తం చేశాడు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఏసు చిత్రాన్ని గీసేందుకు తన రక్తాన్నే రంగులుగా మలుచుకున్నాడు. అతని కుంచె నుంచి జాలువారిన రక్త రేఖలతో రూపుదిద్దుకున్న ఏసు చిత్రం చూపరులను ఆకట్టుకుంటోంది. ఇంటర్‌ చదివిన శ్రీచరణ్‌ మండపల్లి సత్యానందం వద్ద చిత్రలేఖనం నేర్చుకుంటున్నాడు. - మండపేట/ఆంధ్రజ్యోతి

ముగిసిన ఏపీఎస్పీ రేంజ్‌-1 క్రీడా పోటీలు



పరుగు పందెంలో...

కాకినాడ రూరల్‌, ఏప్రిల్‌ 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్‌ మండలం రమణయ్యపేటలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌ మైదానంలో మూడు రోజులు జరిగిన ఏపీఎస్పీ రేంజ్‌-1, గేమ్స్‌, క్రీడా పోటీలు గురువారం సాయంత్రం ముగిసాయి. ముఖ్య అతిథిగా ఐజీపీ బి.రాజకుమారి, డీఐజీ ఫకీరప్ప హాజరయ్యారు. 3వ బెటాలియన్‌ కమాండెంట్‌ ఎం.నాగేంద్రరావు మాట్లాడుతూ క్రీడా పోటీలు నిర్వహించే అవకాశాన్ని తమ బెటాలియన్‌కు ఇచ్చినందుకు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథి రాజకుమారి మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఫకీరప్ప మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శారీరక వ్యాయామం చేయాలన్నారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను అతిథులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బాణసంచా కాల్పులు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కమాండెంట్లు రామకృష్ణ, సుస్మిత, అదనపు కమాండెంట్‌ దేవానందరావు, అసిస్టెంట్‌ కమాండెంట్లు చంద్రశేఖర్‌, మన్మధరావు, ఆర్‌ఐలు అజయ్‌కుమార్‌, రవిశంకర్‌, విఠలేశ్వరరావు, ప్రసాద్‌, 3వ బెటాలియన్‌ పాఠశాల ప్రిన్సిపాల్‌, విద్యార్థులు పాల్గొన్నారు.



పరుగో... పరుగు





విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఐజీ ఫకీరప్ప, 3వ బెటాలియన్‌ కమాండెంట్‌ నాగేంద్రరావు

సరళం, సులభం, సత్వర న్యాయం

ప్లాపస్‌!

- తెల్ల కాగితంపై ఫిర్యాదు రాసిస్తే చాలు
- విద్యుత్‌, తాగునీరు, వీధి దీపాలు, రవాణా, వైద్యం, విద్య ఇబ్బందులపై ఆధారాలు ఏదైనా సరే.. మెరిట్స్‌ ప్రకారం తీర్పు
- న్యాయవాది అవసరం లేదు..
- కోర్టు ఫీజు ఉండదు
- తీర్పుపై అప్పీలుకు అవకాశం లేదు
- కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేదు

ఆస్పత్రిలో వైద్యపరంగా ఇబ్బంది ఉందా?... బీమా, విద్యా సంస్థలు ఇబ్బంది పెడుతున్నాయా?... తాగునీరు, వీధి దీపాల సమస్య ఉందా?... ప్రభుత్వాధికారులకు విన్నవించినా పట్టించుకోవట్లేదా?... న్యాయం జరగట్లేదని నిస్సహాయ స్థితిలో ఉన్నారా?... దిక్కెవరని కుమిలిపోతున్నారా?.. వీటన్నిటికీ సమాధానమే 'ప్లాపస్‌'. ప్రజల దైనందిన జీవనంలో ఎదురయ్యే ఎన్నో సమస్యలకు అద్భుతమైన పరిష్కార వేదిక. ప్రజల్లో అవగాహన లేకపోవడంతో ఎంతో అమూల్యమైన సేవలు అక్కరకు రాకుండా పోతున్నాయి. ఒక జడ్జి ఆధ్వర్యంలో విచారణ జరిగి తీర్పు (అవార్డు) ఇచ్చే సంస్థను జనం ఉపయోగించుకోలేకపోతున్నారు. సహజ న్యాయసూత్రాలే ప్రాతిపదికగా, కోర్టు ఫీజులు లేకుండా, సరళమైన ప్రక్రియతో త్వరితగతిన న్యాయం అందించే అధికారాలున్న 'ప్లాపస్‌'పై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'పర్మనెంట్‌ లోక్‌ అదాలత్‌ ఫర్‌ పబ్లిక్‌ యుటిలిటీ సర్వీసెస్‌'నే ప్లాపస్‌ అంటారు. న్యాయ సేవాధికారాల చట్టం-1987కి 37/2002 సవరణలో చాప్టర్‌ 6(ఎ)లో సెక్షన్లు 22(ఎ) నుంచి (ఇ) వరకు తెలియజేశారు. త్వరితంగా, ఇంపార్షియల్‌గా ప్రజలకు సేవలందించడం, మామూలు కోర్టులపై పని ఒత్తిడి భారాన్ని తగ్గించడం ప్లాపస్‌ ముఖ్య ఉద్దేశాలు. ఉమ్మడి తూర్పుగోదావరికి సంబంధించి 2016లో ప్లాపస్‌ మనుగడలోకి వచ్చింది. ఒక చైర్‌పర్సన్‌, ఇద్దరు సభ్యులు విచారణ జరిపి మెజారిటీ అభిప్రాయాన్ని తీర్పుగా ప్రకటిస్తారు. జాతీయ స్థాయి నుంచి మండల స్థాయి వరకు లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ (లోక్‌ అదాలత్‌)లు ఉన్నా వాటి విధులకు ప్లాపస్‌కి స్పష్టమైన తేడా ఉంది. ఇరుపక్షాలు రాజీ పడకపోతే లోక్‌ అదాలత్‌లు ఏ పక్షానా తీర్పు ఇవ్వడానికి కుదరదు. ప్లాపస్‌లో మాత్రం ఆధారాలు, మెరిట్స్‌ని అనుసరించి తీర్పు వెలువరిస్తారు.



● ఉమ్మడి జిల్లాలో...

ఉమ్మడి తూర్పు గోదావరికి సంబంధించి రాజమహేంద్రవరంలోని జిల్లా కోర్టుల ప్రాంగణంలో లోక్‌ అదాలత్‌ భవనం మొదటి అంతస్తులో ప్లాపస్‌ ఉంది. ఇక్కడికి నేరుగా వచ్చి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఎలాంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఒకవేళ చదువు రాకపోయినా దిగాలు చెందాల్సిన అవసరం లేదు. లీగల్‌ ఎయిడ్‌ సిబ్బంది సహాయం చేస్తారు. ఏ భాషకు చెందిన వారైనా ఇబ్బంది ఉండదు.

● ప్రక్రియ ఇలా...

ప్రజలకు అవసరమై సాధారణంగా ప్రభుత్వ నియంత్రణలో ఉండే సేవలైన విద్యుత్‌, నీరు, రవాణా, వైద్యం, టెలిఫోన్‌ సేవల్లో ఇబ్బందులు ఏర్పడితే ముందుగా సాధారణంగా సమస్యను సంబంధిత అధికారులకు తెలియజేయడానికి ప్రయత్నించాలి. అప్పటికీ సమస్య తీరకపోతే నేరుగా ప్లాపస్‌కి వెళ్లవచ్చు. ఒక తెల్ల కాగితంపై అర్జీ రాసి ఇవ్వాలి. ఎవరికైతే నోటీసు పంపించాలో వారి అడ్రసు స్పష్టంగా తెలియజేయాలి. ప్లాపస్‌ పిటిషన్‌ స్వీకరించిన తర్వాత ప్రత్యర్థులకు నోటీసు పంపించి రాతపూర్వక సమాధానం తీసుకుని రాజీమార్గం ద్వారా పరిష్కారానికి ప్రయత్నం చేస్తుంది. ఆ విధంగా పరిష్కారం కుదరని పక్షంలో ఇరువైపులా విచారించి తీర్పు ఇచ్చే సందర్భాల్లో సహజ న్యాయ సూత్రాలను ప్లాపస్‌ అనుసరిస్తుంది. సీపీసీ, ఎవిడెన్స్‌ యాక్టులతో సంబంధం ఉండదు. గరిష్ఠంగా 3-4 నెలల్లో పరిష్కారానికి కృషి చేస్తారు. ఈ తీర్పు (అవార్డు)పై పౌర కోర్టుల్లో అప్పీలు చేసుకోడానికి వీలుండదు.

● ఏ ఇబ్బందులకు పరిష్కారం?

రూ.కోటి విలువ కలిగిన వ్యాజ్యాలకు ప్లాపస్‌లో విచారించే అధికారం ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు నిర్వహించే రోడ్లు, విమాన, ప్రజా, వస్తు రవాణా, పోస్టల్‌, ప్రైవేటు కొరియర్‌, బీఎస్‌ఎన్‌ఎల్‌, ప్రైవేటు ఫోన్‌ ఆపరేటర్లకు సంబంధించిన వివాదాలు.. విద్యుత్తు, తాగునీరు సరఫరా, కరెంట్‌ షాక్‌ వల్ల కలిగే ప్రమాదాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లోని వైద్యం, బీమా సంస్థలు, బ్యాంకులు, ప్రైవేటు ఫైనాన్సు, ప్రైవేటు, పబ్లిక్‌ విద్యా సంస్థలు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ, ప్రజారోగ్య, పారిశుధ్య, ప్రజా సంరక్షణకు సంబంధించి సేవలు, వీధుల్లో మురుగునీటి సమస్య.. రాష్ట్ర హౌసింగ్‌ బోర్డు, కార్పొరేషన్‌, గృహ నిర్మాణ సొసైటీలు, ప్రైవేటు నిర్మాణదారులతో నిర్మాణాలకు సంబంధించిన వివాదాలకు సంబంధించి రాజీ మార్గంలో పరిష్కారానికి ప్రయత్నం చేస్తారు. ఒకవేళ రాజీ కుదరకపోతే విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు. పది పబ్లిక్‌ యుటిలిటీ సర్వీసెస్‌లోని సేవా లోపాలు, వివాదాలకు ఒక్కపైసా ఖర్చు లేకుండా, న్యాయవాది అవసరం లేకుండా వేగంగా పరిష్కారం లభిస్తుంది. పిటిషన్‌ వేయడానికి ఒక ఫార్మాట్‌ అంటూ ఉండదు. ప్రజలు వారికి తోచిన సరళమైన భాషలో పిటిషన్‌ రాయవచ్చు. ఒకవేళ రాయడం రాకపోతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకరిస్తుంది.

ఇవిగో కేసులు.. పరిష్కారాలు..

● అనపర్తి మండలానికి చెందిన ఒక బాలిక పదో తరగతి ఉత్తీర్ణత సాధించింది. సర్టిఫికెట్‌లో తల్లిదండ్రుల్లోని ఓ పేరులో ఇంగ్లిషు అక్షరాల్లో తప్పుదొర్లింది. విద్యా శాఖ అధిరుల చుట్టూ తిరిగి విసిగిపోయిన ఆ బాలిక ప్లాపస్‌ని ఆశ్రయించింది. ప్లాపస్‌ ప్రక్రియ ప్రారంభించింది. 15 రోజుల్లో ఎస్‌ఎస్‌సీ బోర్డు పేరు సరిజేసి పంపిన సర్టిఫికెట్‌ను ఆ బాలిక చేతికి ప్లాపస్‌ అందజేసింది.

● రాజమహేంద్రవరానికి చెందిన ఓ మహిళ బ్యాంకులోను తీర్చేశారు. కానీ ఆమె హామీగా ఇచ్చిన దస్తావేజులను ఇవ్వడానికి మాత్రం బ్యాంకు అధికారులు పదేపదే తిప్పించుకున్నారు. బాధితురాలు ప్లాపస్‌ను ఆశ్రయించగా ఇరువైపులా వాదనల అనంతరం రెండు వారాల్లో ఆమెకు దస్తావేజులు ఇవ్వాలని తీర్పు చెప్పారు.

● రాజానగరానికి చెందిన ఒక వ్యక్తి తన ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో చెత్త వేస్తున్నారని, దుర్వాసన వస్తోందని, హానికరంగా ఉందని ప్లాపస్‌లో ఫిర్యాదు ఇచ్చారు. వెంటనే చెత్తను తరలించి ఆ ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ప్లాపస్‌ ఆదేశించింది.

- వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్‌ హత్య కేసులో ఎట్టకేలకు కీలక అడుగు
- పోలీసు దర్యాప్తునకు సహకరించేందుకు ప్రత్యేక న్యాయవాదిగా ముప్పాళ్ల నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- హత్య కేసుపై మొదటి నుంచీ సుబ్రహ్మణ్యం కుటుంబం తరపున ముప్పాళ్ల పోరాటం

'అనంత'పాపాలు పండేనా?

(కాకినాడ/రాజమహేంద్రవరం సిటీ, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్‌ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇన్నేళ్లపాటు కేసు విచారణ పూర్తిగా పక్కనపడిపోయిన నేపథ్యంలో కేసు మరింత లోతుగా విచారణ జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పోలీసు విచారణకు సహకరించేందుకు వీలుగా రాజమహేంద్రవరానికి చెందిన సీనియర్‌ న్యాయవాది, మానవ హక్కుల నేత ముప్పాళ్ల సుబ్బారావును నియమించింది. హత్య కేసులో ప్రాసిక్యూషన్‌కు సహాయం చేయడానికి వీలుగా సుబ్బారావును నియమిస్తున్నట్లు హోంశాఖ గురువారం జారీ చేసిన జీవో నెం.538లో పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇన్నేళ్లపాటు మూలనపడిపోయిన హత్య కేసు విచారణ ఇకపై మరింత లోతుగా జరగనుంది. ఈ హత్యకు సంబంధించి ప్రధాన నిందితుడైన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుపై ముప్పాళ్ల సుబ్బారావు తొలి నుంచీ పోరాటం చేస్తున్నారు. హత్య కేసు నమోదు నుంచి చార్జిషీట్‌ దాఖలు వరకు అప్పటి ప్రభుత్వం కేసును ఎలా నీరుగార్చేలా వ్యవహరించిందనేదానిపై ఆయన న్యాయపరంగా పోరాటం చేస్తున్నారు. డ్రైవర్‌ సుబ్రహ్మణ్యం కుటుంబానికి న్యాయపరంగా మూడేళ్ల నుంచి సహకరిస్తున్నారు.

ఎంత అరాచకమో....

ఎమ్మెల్సీ అనంతబాబు 2022 మే 18న రాత్రి కాకినాడలో డ్రైవర్‌ సుబ్రహ్మణ్యం ఇంటికి వచ్చి పని ఉందని తీసుకువెళ్లాడు. ఆ తర్వాత కాకినాడ బీచ్‌ రోడ్డులో దారుణంగా దాడి చేసి కొట్టి చంపాడు. మే 19 తెల్లవారుజామున మృతదేహాన్ని స్వయంగా తన కారులో డ్రైవర్‌ ఇంటికే తీసుకువెళ్లి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. కుటుంబీకులు తిరగబడ్డంతో అంత్యక్రియలకు డబ్బులు ఇస్తానని, నోరు తెరవొద్దని బెదిరించాడు. ప్రభుత్వ పెద్దలకు సన్నిహితుడు కావడంతో అనంతబాబు కోసం పోలీసులు కనీసం గాలించలేదు. మీడియా ఒత్తిడితో గాలింపు ముమ్మరం చేయగా హత్య తానే చేశానని పోలీసుల ఎదుట ప్రత్యక్షమయ్యాడు. తీరా అధికార పార్టీ ఒత్తిళ్లతో పోలీసులు కేసును నీరుగార్చడం కోసం కేవలం అనుమానాస్పద హత్యగా నమోదు చేయడానికి ప్రయత్నించారు. కానీ బాధితులు, దళిత సంఘాల ఆందోళనతో చివరకు కేసును హత్యకేసుగా మార్చారు. ఆ తర్వాత అనంతబాబును అరెస్ట్‌ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్‌ జైలుకు తరలించారు. పోలీసులు దాఖలు చేసిన ఛార్జిషీటులోను అనంతబాబుకు అనుకూలంగా వ్యవహరించారు. కొన్నాళ్లకు మధ్యంతర బెయిల్‌పై ప్రస్తుతం స్వేచ్ఛగా బయటే తిరుగుతున్నాడు.

ముప్పాళ్ల పోరాటం ...



కేసు దర్యాప్తును పోలీసులు పూర్తిగా నీరుగార్చేశారు. ఇదే విషయమై సీనియర్‌ న్యాయవాది, ఏపీ బార్‌ కౌన్సిల్‌ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు పోరాటం చేశారు. బెయిల్‌ రద్దు, విచారణ లోతుగా జరిగేలా పోరాటం చేశారు. ప్రభుత్వం మారాక కేసు విచారణ వేగంగా జరుగుతుందని భావించినా కొంత ఆలస్యం అయింది. ఇటీవల కేసుకు సంబంధించి దర్యాప్తు లోపాలు, ఇతర ఆధారాలను ముప్పాళ్ల ప్రభుత్వానికి వివరించారు. ఈ నేపథ్యంలో కేసుపై తొలి నుంచీ పోరాటం చేస్తోన్న ముప్పాళ్ల సహకారం పోలీసు లకు అవసరమని ప్రభుత్వం భావించింది. కేసు తదుపరి దర్యాప్తునకు పోలీసులకు సహకారం అందించి పురోగతి వచ్చేలా చేయడానికి ప్రభుత్వం నిర్ణయించడంతో బాధితుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



నీటి విలువ తెలుసుకో.. పొదుపుగా వాడుకో అంటుంటారు పెద్దలు.. సమయానికి చుక్క నీరు లేకపోతే ప్రాణాలే పోతాయి.. ఈ దృశ్యాలే అందుకు నిదర్శనం. భానుడు మండిపడుతున్నాడు.. ఉదయం 10 గంటలు దాటిన తరువాత బయటకు రావాలంటేనే భయపడేంతగా ప్రతాపం చూపుతున్నాడు..దీంతో 11 గంటలకే రోడ్లన్నీ కర్ఫ్యూని తలపిస్తున్నాయి.. ఎండను తట్టుకోలేక గూడు ఉన్న వారు గూటికి చేరుతుంటే గూడు లేని వారు అపసోపాలు పడుతున్నారు.. ఈ చిత్రంలో భిచ్చగాడిని చూశారా.. వయసు 70పైనే ఉంటుంది.. చాలా కాలంగా రాజమహేంద్రవరం కంబాలచెరువు ప్రాంతంలో ఉంటున్నాడు.. గురువారం మధ్యాహ్నం ఎండను తాళలేకపోయాడు.. ఉక్కబోతను తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. ఎక్కడైనా నీళ్లు దొరక్కపోతాయా అని అటూ ఇటూ చూశాడు.. ఆ సమయానికి కుళాయిలు రావు.. ఎవరింటికైనా వెళ్లినా నీళ్లివ్వరు.. అంతే అటుగా వెళుతూ వాటర్ ఫౌంటైన్‌లో ఉన్న నీటిని చూశాడు.. ప్రాణం లేచివచ్చినట్టు అనిపించింది. వెంటనే ఆ నీటిని కొద్దిగా సేవించి.. వేడిగా ఉన్నా ఆ నీటితోనే ముఖం కడుక్కుని సేదతీరాడు.. ప్రభుత్వం గ్రామాల్లో పశువుల కోసం వాటర్ పాండ్‌లు కట్టేందుకు సమాయత్తమైంది..నగరాల్లోని కొన్ని ప్రాంతాల్లో వేసవిలోనైనా నిత్యం నీటి సదుపాయం ఉండే ఏర్పాట్లు చేస్తే ఇటువంటి వారికి ఇబ్బందే ఉండదు.. సర్కారు ఆ దిశగా ఆలోచించాల్సిందే.

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

ఈదురు గాలులకు కూలిపోయిన

132 కేవీ విద్యుత్ టవర్

- సుందరపల్లి పంటపొలాల్లో ఘటన
- కోనసీమలో విద్యుత్ సరఫరాకు అంతరాయం
- టవర్ పునరుద్ధరణ పనులు పరిశీలించిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే

కె.గంగవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 14న మంగళవారం మండలంలో వీచిన ఈదురుగాలులకు సుందరపల్లి గ్రామ పరిధిలోని పంట పొలాల్లో ఉన్న విద్యుత్‌శాఖకు చెందిన 132 కేవీ టవర్ కూలిపోయింది. దీనివలన కోనసీమలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బొమ్మూరు నుంచి రామచంద్రపురం అక్కడి నుంచి వయా కె.గంగవరం మండలంలోని పలు గ్రామాలను కలుపుకుంటూ గోదావరినది దాటి అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట, ముమ్మిడివరం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఈ లైన్‌లో టవర్ కూలిపోవడంతో కోనసీమ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. అయితే వేరే ప్రాంతాల నుంచి విద్యుత్ సరఫరా తీసుకుని కోనసీమ ప్రాంతాల్లో అరకొర సరఫరా చేశారు. దీనిపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడింది. దీంతో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు)లు ఆర్డీవో దేవర కొండ అఖిల, విద్యుత్ శాఖ డిస్కం అధికారులతో కలిసి టవర్ పునరుద్ధరణ పనులు స్వయంగా పరిశీలించారు. త్వరితగతిన టవర్ నిర్మాణం పూర్తిచేసి గురువారం రాత్రికల్లా విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ఆదేశించారు. ట్రాన్స్‌కో సీఈ శ్యాంప్రసాద్, ఎస్ఈ గురుబాబు, ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఏడీ జీవవీవీ సత్యనారాయణ, ఏఈ వెంకటేశ్వరరావులు, తహశీల్దార్ బండి మృత్యుంజయరావు వారి వెంట ఉన్నారు.


సుందరపల్లి వద్ద పడిపోయిన విద్యుత్ టవర్


మంత్రి సుభాష్, ఎంపీ హరీష్‌లకు టవర్ పునరుద్ధరిస్తున్న పనులు వివరిస్తున్న ఆర్డీవో అఖిలప్రియ

రైతులకు నష్టపరిహారం ఇప్పిస్తాం

టవర్ పడిపోవడం వలన, టవర్ పునరుద్ధరణ సమయంలో చేతికి వచ్చిన పంట పాడైందని స్థానిక రైతులు మంత్రి సుభాష్, ఎంపీ హరీష్‌కు విన్నవించారు. దీనిపై ఆయన రైతులు ఆందోళన చెందవద్దని, నష్టపరిహారం ఇప్పిస్తామన్నారు. ఆర్డీవో డి.అఖిలప్రియతో నష్టం అంచనాలు వేయించాలని, పరిహారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సలాది రమేష్, శీరెడ్డి సత్తిబాబు, తాడాల జానకిరామ్, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా గొడౌన్‌లో పేలుడు

- పంగిడిలో ఘటన..
- తప్పిన ప్రాణాపాయం
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి



కొవ్వూరు మండలం పంగిడిలో అగ్నికి ఆహుతైన బాణసంచా గొడౌన్, పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం పంగిడిలోని బాణసంచా గొడౌన్‌లో పేలుడు సంభవించింది. ప్రమాద సమయం లో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం తెలుసుకున్న కొవ్వూరు అగ్నిమాపకశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు అధికారులు గుర్తించారు. సూర్యకారం, గంధకం, బొగ్గు నిలవచేసి ఉంచారు. అలాగే 150 జువ్వలు, 50 ఔట్లు, 4000 టపాకాయలు, సుమారు 15 కిలోలు తయారు చేసినవి, రా మెటీరియల్ 15 కిలోలు మొత్తం 30 కేజీల ఫైర్ మెటీరియల్ గొడౌన్‌లో ఉన్నాయి. ఒకవైపు ఎండ వేడిమి, మరో వైపు గొడౌన్ తలుపులు మూసేసి ఉండడంతో ప్రమాదం జరిగిందని అధికారులు చెబుతున్నారు. కొవ్వూరు మండ లం ఐ.పంగిడి, చాగల్లు మండలం మీనానగరం మ ధ్యలో ఉన్న నఫీజ్ బాణసంచా గొడౌన్‌లో జరిగిన అగ్ని ప్రమాద ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. ప్రమాద వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాణసంచా తయారీ యూనిట్‌లను పరిశీలించి తగిన భద్రతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా బాణాసంచా తయారీదారులు లైసెన్సుల కాలపరిమితి ముగిసిన వారిని గుర్తించి రెన్యూవల్ అనుమతులు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాణసంచా భద్రపరిచే గొడౌన్‌ల వద్ద తగిన భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. పంగిడిలో నసీఫ్ ఫైర్‌క్రాకర్స్‌కు ఇచ్చిన అనుమతి మార్చి 31వ తేదీతో ముగిసిందన్నారు. జిల్లా వ్యాప్తంగా బాణసంచా భద్రపరిచే గొడౌన్‌లను పోలీసు, రెవెన్యూ, ఫైర్, స్థానిక సంస్థల అధికారుల బృందం పర్యవేక్షించి లైసెన్సులు లేకపోయినా, తగిన భద్రతా ప్రమాణాలు పాటించకపోయిన తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్ఎఫ్‌వో ఈ.స్వామి, డీఎఫ్‌వో మార్టిన్ లూథర్‌కింగ్, ఆర్డీవో రాణిసుస్మిత, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, రూరల్ సీఐ కె.విజయబాబు, ఫైర్ అధికారి వేణు, ఎస్ఐ కె.శ్రీహరిరావు ఉన్నారు.




మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్, విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తున్న అతిథులు

క్రీడలతో మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం

- కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

జేఎన్‌టీయూకే, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వృత్తి, ఆరోగ్యరీత్యా మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు క్రీడలు దోహదపడతాయని కాకినాడజిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. వర్శిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో గురువారం యూసీఈకే క్రీడాదినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మోహన్‌రావు అధ్యక్షుడిగా, జేఎన్‌టీయూకే స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా ఎస్పీ బిందుమాధవ్, గౌరవ అతిథులుగా భారత బీచ్ వాలీబాల్ జట్టు కెప్టెన్, అంతర్జాతీయ వాలీబాల్, బీచ్ వాలీబాల్ క్రీడాకారుడు ఎంసీహెచ్‌ఆర్ కృష్ణంరాజు, ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనే వారి సంఖ్యను చూసి భయపడుతున్నారన్నారు. కానీ ఉన్న ఉద్యోగాల్లో మనకు కావాల్సింది ఒక్కటేనని గుర్తుచేసుకుని విజయం సాధించాలన్నారు. కృష్ణంరాజు మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు క్రెడిట్ పాయింట్స్ ఇస్తున్న వర్శిటీ జేఎన్‌టీయూకే ఒక్కటేనన్నారు. వీసీ ప్రసాద్ మాట్లాడుతూ క్రీడలద్వారా పట్టుదల, కార్యసిద్ధి మెరుగుపడి ఒత్తిడిని జయించవచ్చన్నారు. 2024-25 వార్షిక క్రీడా నివేదికను శ్యామ్ కుమార్ సమర్పించారు. వర్శిటీ తరపున జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు, విజేతలకు, పలు క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు, బహుమతులు, ప్రతిభా పత్రాలను అతిథులు అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు మాజీ వైస్ చాన్సలర్లు, డైరెక్టర్లు, వైస్ ప్రిన్సిపాల్స్, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైలులో నేరాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

- బంగారం, నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం


పట్టుబడిన సొత్తుతో రైల్వే పోలీసులు

తునిరూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తుని రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో రైళ్లలోను, రైలుకోసం వేచి చూస్తున్న ప్రయాణికులవద్ద బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు, నగదు దొంగిలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రాజమండ్రి రైల్వే డీఎస్పీ జయరాం ప్రసాద్ ఆదేశాల మేరకు ముమ్మర తనిఖీలు చేపట్టి అనుమానాస్పద వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. రేగుపాలేనికి చెందిన షేక్ యాసిన్‌బాబా అనే వ్యక్తిని తుని రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై పట్టుకుని ఆరా తీయగా ఆయన వద్ద రెండు గ్రాముల బంగారం, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

ఉన్నతమైన ఆలోచనలు జీవితాన్ని మారుస్తాయి



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

- కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
- యూసీఈకే వార్షికోత్సవ వేడుకలు

జేఎన్‌టీయూకే, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉన్నతమైన ఆలోచనలు జీ వితాన్ని మారుస్తాయని కాకినాడజిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. వర్శిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో యూసీఈకే వార్షికోత్సవ వేడుకలను గురువారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ కళాశాలలో విద్యనభ్యసించడం ప్రతిఒక్కరి జీవితంలో ఒక మధురమైన జ్ఞాపకమన్నారు. గౌరవఅతిథి, వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ విద్యను కేవలం మార్కులతోనే సరిపెట్టకూడదని, విద్యద్వారా నైతిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. అనంతరం అకడమిక్, ఎండోమెంట్ అవార్డులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అతిథులు సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు అని బురిడీ కొట్టిస్తున్న వ్యక్తి ఆచూకీ తెలపండి


ఆచూకీ తెలపాలంటూ పోలీసులు విడుదల చేసిన నిందితుడు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పోలీసు అని చెప్పి ప్రజలను బెదిరించి అమాయకులవద్ద డబ్బులు కాజేస్తున్న వ్యక్తి ఆచూకీ తెలపాలని ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు కోరారు. నిందితుడి వాహనంతో ఉన్న ఫొటో వివరాలను గురువారం విలేఖరులకు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో నిందితుడు మారుతి వెలోనో డెల్టా కారు నెంబరు ఏపీ16 ఎఫ్‌డీ 3060 నీలి రంగు వాహనంలో పోలీసు బోర్డు పెట్టుకుని కలియ తిరుగుతూ ప్రజలను మోసగించి డబ్బులు గుంజుతున్నాడని తెలిపారు. ఇతడి ఆచూకీని రాజమహేంద్రవరం టూటౌన్ సీఐ 9440796576 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

మోతుగూడెం బాలుడికి గిన్నీస్ బుక్‌లో చోటు



ఇజ్రాయిల్‌కి గిన్నీస్ బుక్ అవార్డు అందజేస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వేముల ఇజ్రాయిల్ గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. 2024 డిసెంబరు ఒకటిన ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన సంగీత కచేరీలో ఇజ్రాయిల్ పాల్గొన్నాడు. కీబోర్డు ద్వారా ఒకేసారి 18 దేశాలకు చెందిన 1050 మంది వాయిద్యకారులతో కలిసి పాల్గొని గంట వ్యవధిలో ఈ ప్రక్రియ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లో నిర్వాహకులు ఈ ధ్రువపత్రం అందజేశారు. ఇజ్రాయిల్ పొల్లూరు గ్రామంలోని చర్చిపాస్టర్ వేముల అబ్రహం, సత్యశీల కుమారుడు. మోతుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోంస న్, ఉపాధ్యాయులు పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఈ విద్యార్థిని అభినందించారు. గిన్నీస్ బుక్‌లో పొల్లూరు బాలుడికి చోటు దక్కింది. ఈ బాలుడికి సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ సీనియర్ ఎకౌంటు ఆఫీసర్ వరప్రసాద్, మోతుగూడెం ఇన్‌చార్జ్ ఎస్ఐ శివకుమార్, పంచాయతీ సెక్రటరీ జి.మోహన్, సర్పంచ్ ఆకేటి సీత, ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, డీఏవీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లె రఘురాం బాలుడికి అభినందనలు తెలిపారు.

సేల్స్‌టాక్స్ డిప్యూటీ కమిషనర్‌పై విచారణకు ఆదేశం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డివిజన్ సేల్స్‌టాక్స్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.సత్య ప్రకాష్‌పై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సీసీఎస్‌టీ డిప్యూటీ కమిషనర్ ఏబీ హర్షవర్ధన్‌ను విచారణాధికారిగా నియమించింది. సత్యప్రకాష్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న సమయంలో ఒంగోలుకు చెందిన ఓ కంపెనీ డీలరుకు నిబంధనలకు విరుద్ధంగా రూ.16.50లక్షలు టాక్స్ రిఫండ్ చేశారు. లోతుగా విచారణ చేసిన ప్రభుత్వం లోపాలను గుర్తించడానికి విచారణకు ఆదే శించింది.గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇద్దరు మహిళల మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు ఆరు నెలల జైలు

సామర్లకోట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా సామర్లకోట మండలం పెద బ్రహ్మదేవం కెనాల్‌రోడ్లో లారీని అతివేగంగా నడుపుతూ రోడ్డు పక్కన నడిచి వెళుతున్న ఇద్దరు మహిళలను ఢీకొనడంతో సదరు ఇద్దరు మహిళలు మృతి చెందడానికి కారకుడైన లారీ డ్రైవర్ అనకాపల్లి జిల్లా గుట్టివాడకు చెందిన అద్దం భాస్కరరావుకు ఆరు నెలల జైలుశిక్ష, రూ.5,500 జరిమానా విధిస్తూ కాకినాడ ఐదో కోర్టు మేజిస్ట్రేట్ షేక్‌నరీన్ తీర్పునిచ్చినట్లు సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ గురువారం సాయంత్రం తెలిపారు. 10 నవంబరు 2022లో జరిగిన ఈ ప్రమాదంపై అప్పటి ఎస్ఐ సునీత కేసు నమోదుచేసి దర్యాప్తు నిర్వహించారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ రఘువీర్ వాదించగా సాక్షులను కోర్టు కాని స్టేబుల్ సతీష్ ప్రవేశపెట్టగా తుది తీర్పును గురువారం ప్రకటించినట్లు సీఐ చెప్పారు.

విధుల నుంచి సెక్యూరిటీ గార్డు తొలగింపు

అన్నవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అన్నవరం కొండపై పార్కింగ్ ఏరియాలో విధుల్లో ఉన్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు బహిరంగంగా ధూమపానం చేయడం విధితమే. ఆ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో రావడంతో భద్రతా అధికారులు స్పందించి అతనిని విధుల నుంచి తప్పించాలని సంబంధిత సెక్యూరిటీ ఏజెన్సీకి తెలపడంతో వారు అతడిని తొలగించారు.

10న జాతీయ లోక్ అదాలత్


సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మోటారు వాహన ప్రమాదాల కేసులను మే 10న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించాల ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత అన్నారు. వివిధ బీమా సంస్థల ప్రతినిధులతో గురువారం సమావేశమయ్యారు. పెం డింగ్‌లో ఉన్న ఆ తరహా కేసుల జాబితాను డీఎల్ ఎస్ఏకి అందజేయాలని సూచించారు. బాధితులకు తగు పరిహారం అందజేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి మాట్లాడుతూ ముందస్తు లోక్‌అదాలత్ సమావేశాల్లో బీమా సంస్థల ప్రతినిధులు, ప్రమాద కేసుల్లోని బాధితులు, ఇరుపక్షాల న్యాయవాదులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జీపీసీహెచ్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల పట్ల వివక్ష చూపరాదు

స్త్రీ, పురుషులతో సమానంగా ట్రాన్స్‌జెండర్లకూ హక్కులు ఉన్నాయని, వారిపట్ల వివక్ష చూపరాదని పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఎ.గాయత్రి దేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులపై గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులు, స్వయం ఉపాధి అవకాశాలపై వివరించారు. ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా డీఎల్ ఎస్ఏ తరఫున చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కె.రమేశ్ బాబు పాల్గొన్నారు.

తునిలో యువకుడి అనుమానాస్పద మృతి


ఎంఆర్‌పేటలో అనుమానాస్పదంగా మృతి చెందిన యువకుడు

తునిరూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణం ఎమ్మార్‌పేటలో యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందడం సంచలనం రేకెత్తించింది. అనకాపల్లి జిల్లా రాంపల్లి మండలం సీతపాలెం గ్రామానికి చెందిన రుత్తల లీలామాధవ్(23) కొద్దికాలంగా కేశవరంలోని ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో ఉద్యోగంలో చేరి విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల తుని పట్టణం ఎమ్మార్‌పేటలో అద్దెకి దిగిన ఆ యువకుడు అదే ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందాడు. సాయంత్రం అయినా గది తలుపులు తెరవకపోవడంతో ఇంటి యజమాని పరిశీలించగా లీలామదన్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెంది ఉండడాన్ని గమనించాడు. విషయాన్ని పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి సీఐ గీతారామకృష్ణ, ఎస్ఐలు చేరుకుని పరిశీలించారు. పోలీసుల సమాచారంతో మృతుడి తల్లిదండ్రులు అక్కడకు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. తమ కుమారుడు ఒక అమ్మాయితో ప్రేమలో ఉన్నాడని, పలుమార్లు హెచ్చరించినా పెడచెవిన పెట్టాడని, ఈ కారణంగానే తమ కొడుకు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని మృతుడి తల్లిదండ్రులు తెలిపారు. శవ పంచనామాలు నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రాష్ట్రంలో పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



ప్రదర్శనలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, అక్కినేని వనజ, తదితరులు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల లేని పేదలకు ఇంటి స్థలాల కోసం ఎనిమిది నెలలుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. గురువారం సీపీఐ జిల్లా సమితి నాయకత్వంలో ఇంటి స్థలం కోసం పేదల గోడు పేరుతో రాజమహేంద్రవరంలోని ఆవ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాల కోసం వచ్చిన వారినుద్దేశించి ఆయన మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ భూములను పేదలకు ఇళ్ల స్థలాల కోసం పంచాలన్నారు. ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలోని ఆవ ప్రాంతంలో 22 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుస్తోందని, ఈ భూమిని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు వచ్చే వరకూ తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కాగా, అంతకుముందు రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తదితరులు ఆవ ప్రాంతం నుంచి ప్రదర్శనగా ఇళ్లస్థలాల అర్జీదారులతో కలసి ఆధునిక మేకల కబేళా పక్కనున్న ప్రభుత్వ స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఎర్రజెండా పాతి కొబ్బరికాయ కొట్టి ఈ స్థలాన్ని పేదలకు ఇవ్వాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, జట్ల సంఘం అధ్యక్షుడు రాంబాబు, నగర కార్యదర్శి కొండలరావు, సప్పరమణ, లావణ్య, ఇతర నాయకులు, ఆవ, పరిసర ప్రాంతాలకు చెందిన అర్జీదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

కాకినాడలో రేపు 'రన్ ఫర్ జీసస్'

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ, ఆరాధన టీవీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం భాను గుడి కూడలి నుంచి మెక్లారిన్ స్కూలు వరకు 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పాస్టర్ దేవిశెట్టి క్రైస్ట్ తెలిపారు. ఉదయం ఆరు గంటలకు ఇది ప్రారంభమవుతుందన్నారు.


ఢిల్లీలో కేక్ కట్ చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

సీఎం చంద్రబాబు పుట్టినరోజు ముందస్తు వేడుకలు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విదేశీ పర్యటన నిమిత్తం ఢిల్లీ చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాబోయే పుట్టినరోజు వేడుకను రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు గురువారం ముందస్తుగా నిర్వహించారు. ఢిల్లీలో సీఎం బస చేసిన ప్రదేశానికి ఎంపీ కేక్ తీసుకెళ్లి ఆయనతో కట్ చేయించారు. పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబునాయుడు సంపూర్ణ ఆరోగ్యంతో విజయపథంలో మరిన్ని హోదాలు అందుకోవాలని ఆకాంక్షించారు.


ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సానా సతీష్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు

కరప, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతిభ కలిగిన విద్యార్థులు, క్రీడాకారులకు పలు ప్రోత్సాహకాలందిస్తున్నామని ఫౌండేషన్ చైర్మన్, హరీష్ స్పోర్ట్స్ అధినేత తలాటం హరీష్ (రాము) పేర్కొన్నారు. కరప హైస్కూల్‌లో గురువారం ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన 23మంది విద్యార్థినులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, మాజీ ఉప సర్పంచ్ దూడల నారాయుడు, హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, పిడక శేషు, ఉపాధ్యాయులు, పీజీటీలు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

'రక్తదానంపై అవగాహన పెంచుకోవాలి'

సామర్లకోట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. స్థానిక రైతు భవన్‌లో తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు)తో కలిసి ప్రారంభించారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వీఆర్వోలు, రెవెన్యూ, సచివాలయాల సిబ్బం దికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంపీడీవో కె.హిమమహేశ్వరి, కమిషనరు శ్రీవిద్య, సర్వే డిప్యూటీ తహసీల్దారు వై.శ్రీనివాసు, కార్యాలయ సూపరింటెండెంట్ పద్మ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన శేఖర్

కాకినాడ సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన బచ్చు శేఖర్ గురువారం సాయంత్రం సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అంతకు ముందు శేఖర్‌ను పలువురు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీని రాష్ట్రంలోనే మంచి కమిటీగా నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. రైతు బజార్లలో మౌలిక సదుపాయాలు


కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏఎంసీ చైర్మన్ శేఖర్

కల్పించడంతో పాటు రైతులు పండించిన పంటలకు మద్దతు ధర వచ్చేలా చూస్తానన్నారు.


ఈఎస్ఐ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాల నివారణ జాగ్రత్తలను వివరిస్తున్న ఫైర్ సిబ్బంది

ఈఎస్ఐ ఆసుపత్రిలో ఫైర్ డెమో

కాకినాడ క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో నాలుగో రోజైన గురువారం కాకినాడ ఈఎస్ఐ ఆసుపత్రిలో ఫైర్ డెమో నిర్వహించారు. సాలిపేట ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు ఆధ్వర్యంలో సిబ్బంది ఆసుపత్రుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు, వాటిని నిర్మూలించే మెళకువలపై సిబ్బందికి ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన చర్యలపై విశదీకరించారు. ఆసుపత్రిలో ఉన్న రోగులను సురక్షిత ప్రాంతానికి సులువుగా తరలించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్‌లు ఎం.చక్రపాణి, రెడ్డి, రాంబాబు, ఎస్కే సంధాని తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆందోళన

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో చనిపోయిన ఎ ఎలక్ట్రీషియన్ పల్లపు సురేష్‌బాబు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మల్లం గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. నిరుపేద అయిన సురేష్‌బాబు మృతితో అతడి కుటుంబం రోడ్డున పడిందని, ఆదుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదన్నారు. కుల వివక్ష పోరాట సమితి, మాలమహానాడు, అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు కూరాకుల సింహాచలం, గుబ్బల రాజు, ఎద్దు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దు

జిల్లా వ్యవసాయాధికారి, పాడా పీడీ సూచన

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఎవ్వరూ తక్కువ ధరకు అమ్ముకోవద్దని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి సూచించారు. పిఠాపురం మండలం కుమారపురం, ఎఫ్‌కే పాలెం, గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామాల్లో గురువారం వారు పర్యటించారు. వరి కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులను, దాళ్వా మాసూళ్లను పరిశీలించారు. 75 కిలోల గ్రేడ్-ఎ రకం రూ.1,740, సాధారణ రకాలను రూ.1,725కు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొంటుందని తెలిపారు. కొనుగోలు సిబ్బంది విధుల్లో చేరేందుకు కొంత ఆలస్యమైనప్పటికీ ఇప్పుడు అన్ని గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. దళారులకు ధాన్యం అమ్మి నష్టపోవద్దని కోరారు. గోనెసంచులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైస్‌మిల్లర్ల నుంచి ఇబ్బందులు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గొల్లప్రోలు, చేబ్రోలు రైతు సేవా కేంద్రాల ద్వారా 638 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 నుంచి 36 గంటల వ్యవధిలో సొమ్ములను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. వారి వెంట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు పి.స్వాతి, ఏవోలు అచ్యుతరావు, సత్యనారాయణ, గొల్లప్రోలు తహసీల్దారు సత్యనారాయణ ఉన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణక్కపేట, నాగులాపల్లి గ్రామాల్లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్.విజయ్‌కుమార్, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు పి. స్వాతి, వ్యవసాయాధికారి వి.జోగిరాజు పర్యటించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలుప్రారంభించారా? లేదా పరిశీలించారు. రమణక్కపేటలో దాళ్వా వరి చేలను ఒబ్బిడి చేసుకున్న రైతులతో చైత్రవర్షిణి మాట్లాడారు. పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించవచ్చన్నారు.


కొత్తపల్లి మండలం రమణక్కపేటలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయకుమార్, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి

అభివృద్ధి పనులు ప్రారంభం

కరప, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలం గొల్లల మామిడాడలో రూ.1.86 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, రూ.2.70 లక్షలతో నిర్మించిన గోశాల, పశువుల తాగునీటి తొట్టెలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. పెద్దాడలో రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, రూ.45.30లక్షలతో నిర్మించిన గోశాలలు, పశువుల తాగునీటి తొట్టెలను ప్రారంభించారు. పెదపూడిలో రూ.1.30కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, రూ.7.86లక్షలతో నిర్మించిన గోశాలను ప్రారంభించారు.

మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ధర్నా

సామర్లకోట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం సామర్లకోట మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. సామర్లకోట కమిటీ ప్రధాన కార్యదర్శి కశింకోట కిషోర్ అధ్యక్షతన నిరసన తెలిపి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ అధికారులకు అందజేశారు. తోకల ప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిసెంట్ల సమ్మె నోటీసు

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): డిమాండ్లు పరిష్కరించకుంటే ఈనెల 28వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిసెంట్లు గురువారం పిఠాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చిన్నారావుకు సమ్మె నోటీసు అందజేశారు. 21న విధులకు దూరంగా ఉండి పెన్‌డౌన్ పాటిస్తామని చెప్పారు.

సారా అక్రమ విక్రయాలపై దాడులు

ముగ్గురు మహిళల అరెస్ట్

సామర్లకోట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిషేధిత సారా విక్రయిస్తున్న ముగ్గురు మహిళలను కాకినాడ ఉత్తర ప్రొహిబిషన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐలు ఎంవీవీఎస్ కుమార్, బీఎన్‌ఎస్ వరహాలు గురువారం రాత్రి తెలిపారు. వారి వద్ద నుంచి సుమారు 25 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. కోశెట్టి వరలక్ష్మి, మాదమని సత్యవతి, కాళ్ల సరోజినిలను అరెస్టు చేశారు. వీరిని కోర్టు ఎదుట హాజరుపరచనున్నట్టు ఎస్‌ఐలు తెలిపారు.

పిల్లలకు పోషకాహారం అందించాలి

గొల్లప్రోలు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పిల్లలుకు పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని ఐసీడీఎస్ అధికారులు సూచించారు. గొల్లప్రోలు పట్టణంలోని సూరంపేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పిల్లల తల్లులకు కమ్యూనిటీ బేస్డ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఎక్యూట్ మాల్ న్యూట్రిషన్‌పై అవగాహన కల్పించారు. పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పిల్లలుకు అందించాల్సిన పర్యవేక్షణ, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలుకు నిర్వహించే ఆకలి పరీక్షలు తదితర అంశాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మానసాదేవి, గొల్లప్రోలు పీహెచ్‌సీ హెచ్‌వీ లక్ష్మి, రమణ, ఏఎన్‌ఎం శివకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

కరప, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కొరుపల్లి గ్రామంలో గురువారం అధికారులు, నాయకులు కలిసి ఎన్రోల్మెంట్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో అనేక వసతులు కల్పించడంతో బాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన జరుతుందన్నారు. పేరెంట్స్ అంగీకారంతో పలువురు చిన్నారులకు ప్రభుత్వ పాఠశాల అడ్మిషన్ పత్రాలను అందజేశారు. జనసేనపార్టీ మండలాధ్యక్షుడు బండారు మురళి, కరప ఏఎంసీ చైర్మన్ ముద్రగడ రమేష్, మాజీ సర్పంచ్ రెడ్డి వీర వెంకటసత్యనారాయణ, చంద్రశేఖర్, రెడ్డి రామరాజు, వీరంరెడ్డి ముత్యాలరావు, దేవినేని నాని, వెంకటరమణ, గోపాల్, సత్తిబాబులు, సీఆర్పీ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

అబాకస్ పోటీల్లో గొల్లప్రోలు విద్యార్థుల సత్తా

గొల్లప్రోలు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అబాకస్ గణిత పరీక్షల్లో గొల్లప్రోలు మాధురి విద్యాలయ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారు. అబాకస్ లెవిల్-2లో బి.గంగామహేష్ (ప్రథమ), వి.రాధేశ్యామ్, ఎం.షణ్ముఖ మణికంఠ (ద్వితీయ), కె.శ్రీబాలాజీ, టి.చిన్మయదేవి, కేజీఎన్‌ఆర్ హర్షిత, కె.రామచరణ్, ఎస్.అనూష (తృతీయ) స్థానాల్లో నిలిచారు. గణితం లెవిల్-3 వేదిక్ మ్యాథ్స్‌లో కె.విద్యాదీక్షిత, పి.కుశ్వంత్ (ప్రథమ), ఎ.నాగబాబు (ద్వితీయ), కేవీ సంతోష్ (తృతీయ) విజేతలుగా నిలిచారు. గురువారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వారందరినీ మాధురి విద్యాసంస్థల అధినేత కడారి తమ్మయ్యనాయుడు అభినందించి



మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మమత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే నానాజీ సతీమణి అరుణ

ఘనంగా ధనమ్మ తల్లి తీర్థం

కరప, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కరప మండలం కొంగోడు, కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామ దేవతలుగా విరాజిల్లుతున్న ధనమ్మ తల్లి తీర్థ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. బుధవారం రాత్రి జాతర జరిపి అమ్మవారి ప్రతిరూపాలను తెల్లవార్లు ఊరేగించారు. గురువారం ఉదయం నుంచి వేలాది మంది భక్తులు రెండు ఆలయాలను దర్శించుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సతీమణి అరుణ, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాకినాడరూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో కరప, గొల్లపాలెం ఎస్‌ఐలు తోట సునీత, మోహన్‌కుమార్, ఇతర స్టేషన్ల ఎస్‌ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

'దాట్ల సాహిత్య కృషి ప్రశంసనీయం'

కరప, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కళారత్న పురస్కార గ్రహీత దాట్ల దేవదానంరాజు సాహిత్య కృషి ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. కాజులూరు మండలం కోలంక ఎస్‌డీవీఆర్‌ఆర్‌పీ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రసిద్ధ కవి, కథకుడు దాట్ల దేవదానంరాజును పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దంతులూరి అనంతవర్మ, యానాం డాక్టర్ ఎస్‌ఆర్‌కే ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, రీజెన్సీ పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు తాతపూడి ప్రసాదరావు, మధునాపంతుల సత్యనారాయణమూర్తి, హెచ్‌ఎం మల్లిపూడి రంగారావు, వీరభద్రరాజు, సోమశేఖరశర్మ, రామభద్రరాజు, కొండ్రాజు, చిట్టిబాబు, సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

'ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎంయు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మూడవ విడత ఉద్యమంలో భాగంగా ఆర్టీసీ సిబ్బంది గురువారం గ్యారేజ్ ఆవరణలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. 38 సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందించినా పట్టించుకోలేదన్నారు. సమస్యలను పరిష్కరించేకపోతే ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. రాష్ట్ర కార్యదర్శి పద్మ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన అంశాల పరిష్కారానికి అధికారులు, ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఏవీ రావు మాట్లాడుతూ 55 రోజులుగా రెడ్ బ్యాచ్ కార్యక్రమాలు, 37 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నా అధికారులు స్పందించట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కొవ్వాడ పంచాయతీలో అవకతవకలపై విచారణ చేపట్టాలి

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కొవ్వాడ పంచాయతీలో జరిగిన అనేక అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గురువారం కొవ్వాడ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కోటిపల్లి ఉమ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, గ్రామంలో పందుల సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, వార్డు సభ్యులు కోరారు. ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను సెక్రటరీ శ్రీకాంత్ స్వీకరించారు. ఏపీ గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాష్‌గౌడ్, సానా శ్రీను, ర్యాలి సతీష్, గుమ్మడి వీరబాబు, డి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గత ప్రభుత్వ చిహ్నాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కరప, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వ చిహ్నాలు... నేటికీ చెరగని స్మృతులు' శీర్షికన ఈ నెల 13న ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి స్పందించారు. విచారణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని కరప తహసీల్దారును ఆదేశించారు. ఈ క్రమంలో పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దారు అనిల్ సంబంధిత ఎండీయూ ఆపరేటర్ బొంతు దుర్గాప్రసాద్‌ను విచారించారు. వాహనంపై ఉన్న మాజీ సీఎం జగన్, నవరత్నాలు లోగోలను పూర్తిగా తొలగించి నివేదికను ఉన్నతాధికారులకు అందించినట్టు అనిల్ తెలిపారు.

దుకాణాల్లో తనిఖీలు

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పెద్ద మార్కెట్, హోల్‌సేల్ మార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్స్ పక్కన గల రైతు బజార్‌లో జిల్లా ఆహార భద్రత నియంత్రణ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పెద్ద మార్కెట్‌లో 70 కిలోలు రంగుకలిపిన చిలకడదుంపలు, రైతు బజార్లో 10 కిలోల దుంపలను గుర్తించి జిల్లా ఆహార భద్రత నియంత్రణ అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. హోల్‌సేల్ మార్కెట్లో లైసెన్స్ లేకుండా విక్రయిస్తున్న ఇద్దరు వ్యాపారస్తులను గుర్తించి నోటీసులు జారీ చేశారు. దాడుల్లో ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెన్షనర్ల హక్కుల సాధనకు కృషి

సామర్లకోట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పెన్షన్‌దారుల సమస్యల పరిష్కారానికి జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ కృషి చేస్తుందని గౌరవాధ్యక్షుడు జి.అప్పారావు, గౌరవ సలహాదారుడు ఆచంట రామారాయుడు పేర్కొన్నారు. సామర్లకోట ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం సంఘ అధ్యక్షుడు ఆర్వీ పల్లేశ్వరరావు అధ్యక్షత గురువారం సాయంత్రం ప్రభుత్వ కళాశాల ఆవరణలో జరిగింది. పెన్షన్, అడిషనల్ క్వాంటం అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సిద్ధా సూర్యనారాయణ, జీవీ రాఘవ, ఎం.డేనియల్‌ప్రసాద్, సత్యాల జాన్ కెన్నడీ బాబు, ఎస్.ఆదినారాయణ, ఖాన్, కొండ, ఎస్.సత్యనాయుడు, బి.రాజేశ్వరి, రామచంద్రరావు, ఎండ్రు ప్రభాకర్, షేక్ అబ్దుల్ సత్తార్ ప్రసంగించారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

పెద్దాపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆర్బీకే సెంటర్లలో తక్షణం సీఎంఆర్‌ను ఓపెన్‌చేయాలని, దళారీల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పులిమేరు ఆర్బీకే ఎదుట సామర్లకోట-ప్రత్తిపాడు రోడ్డుపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వల్లూరి రాజబాబు, బి.రమేష్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కడితి సతీష్, మడికి సత్యం, కర్నాకుల రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధునికీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

పిఠాపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పశువుల సంత ఆధునికీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు సూచించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో పట్టణంలోని పశువుల సంతలో రూ.1.30 కోట్లతో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. వీటిని మర్రెడ్డి గురువారం సాయంత్రం పరిశీలించారు. సంతకు వచ్చే రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆయన వెంట పంచాయతీరాజ్ డీఈఈ వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు ఉన్నారు.

'అంగన్‌వాడీల విషయంలో రాజకీయ జోక్యం తగదు'

తొండంగి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ మినీవర్కర్ల పదోన్నతి విషయంలో రాజకీయ జోక్యం తగదని అంగన్‌వాడీ వర్కర్ల జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రావతి అన్నారు. తొండంగి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విజయవాడలో నిర్వహించ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలన్నారు. సంఘ నాయకులు మేరీ సమాధానం, ధనలక్ష్మి, సుబ్బలక్ష్మి, శాంతకుమారి, కామేశ్వరి, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



అంగన్వాడీ విద్యార్థులతో పీవో సింహాచలం

బాల్యవివాహాలు నిర్మూలించే బాధ్యత మనందరిది

● ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను నిర్మూలించే బాధ్యత అందరిపైన ఉందని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. గురువారం గంగవరం మండలంలోని కొత్తాడ గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో ఏర్పాటుచేసిన కిషోరి వికాసం కార్యక్రమానికి పీవో హాజరయ్యారు. ఈసందర్భంగా కట్టా సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలోని గ్రామాలలో బాలికలు 21 సంవత్సరాలు నిండకుండా ఎవరైనా పెళ్లిళ్ల చేసుకుంటే ఆరోగ్యపరంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. మంచి చదువులు చదువుకొని ఉద్యోగాలు సాధించిన తరువాతే పెళ్లిళ్ల చేసుకోవాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండకుండా ఎవరైన పెళ్లిళ్ల చేసిన, ప్రోత్సహించినా, పెళ్లిలో పాల్గొన్నా అది చట్టరీత్యా నేరమవుతుందని పీవో కట్టా సింహాచలం అన్నారు. అనంతరం కొత్తాడ గ్రామంలోని అంగ న్వాడీ కేంద్రాన్ని పీవో తనిఖీ చేశారు. ఆయన వెంట సీడీపీవో లక్ష్మి ఉన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

● తహశీల్దార్ సరస్వతి

వీఆర్‌పురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) గర్భవతులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని అప్పుడే పుట్టినబిడ్డ, పుట్టబోయే బిడ్డ ఆరో గ్యంగా ఉంటారని వీఆర్ పురం తహశీల్దార్ సరస్వతి అన్నారు. రేఖపల్లిలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం కూనవరం అంగన్‌వాడీ సీడీపీవో నాగలక్ష్మి ఆధ్వర్యంలో 7వ పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా బాలింతలకు శ్రీమంతాలు, పిల్లలకు అన్న ప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కూనవరం సీడీపీవో మాట్లాడుతూ క్రమం తప్ప కుండా అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టిహారం తీసుకోవడంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వెలుగు సిబ్బంది బాలింత లు, తల్లులు పాల్గొనారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ

మోతుగూడెం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి పోషణ పక్వాడ కార్యక్రమం ఆరో వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆకేటి సీత, వార్డు మెంబర్ మల్లూరు రమాదేవి, సీడీపీవో విజయగౌరీ, వైద్యురాలు ప్రతిజ్ఞ, సూపర్‌వైజర్, సంఘమిత్ర ప్రియాంక, కో ఆర్డినేటర్ రాజు పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు ఆహార విషయం పట్ల అవగాహనపై చర్చించారు. కార్యక్రమంలో సెక్టార్‌లోని అన్ని అంగన్‌వాడీ ఆశా వర్కర్లు గర్భిణులు, బాలింతలు పిల్లలు పాల్గొన్నారు.



వీఆర్‌పురంలో బాలింతలకు, గర్భిణులకు అన్నప్రాసన, శీమంతం చేస్తున్న దృశ్యం



గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మహిళల ఆర్థికాభివృద్ధికి

నాటుకోడి ఊరగాయ తయారీపై శిక్షణ

అడ్డతీగల, ఏప్రిల్(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమన్నపాలెం పంచాయతీ లోతట్టు గ్రామమైన రేగుల పాడులో హీపర్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో నాటుకోడి ఊరగాయ తయారీ విధానంపై గిరిజన మహిళలకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు సంస్థ డివిజన్ ప్రాజెక్టు అధికారి డాక్టర్ సునీత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని మహిళలు ఇంటి వద్ద ఉండి ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఈ ఆవకాయ తయారీ ఎంతగానో దోహద పడుతుందన్నారు. అనంతరం మార్కెటింగ్, ప్యాకింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ సంస్థ సిబ్బంది బాబూరావు, శ్యామల, 30 మంది మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



నాటుకోడి ఊరగాయ తయారిపై శిక్షణ ఇస్తున్న సిబ్బంది

ఈడీ చార్జిషీట్‌లో సోనియా, రాహుల్ పేర్లపై నిరసన

ఎటపాక, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీలపై ఈడీ చార్జిషీట్‌లో పేర్లు నమోదు చేయడం ప్రతిపక్షంపై కక్షసాధింపు చర్య అని కాంగ్రెస్ ఎటపాక మండలాధ్యక్షుడు నక్కా వెంకన్న అన్నారు. ఈమేరకు గురువారం ఎటపాకలో నిరసన వ్యక్తం చేశారు. నక్కా వెంకన్న మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రాజకీయ ప్రతీకారంతో సోనియా, రాహుల్ పేర్లు నమోదు చేశారని విమర్శించారు. దేశవ్యాప్తంగా అఖిలభారత జాతీయ కాంగ్రెస్ నిరసన కార్యక్రమంలో భాగంగా పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశానుసారం నిరసన చేపట్టారు.

జాతీయ రహదారిపై నేలకొరిగిన భారీ వృక్షం

మోతుగూడెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం మంగంపాడు గ్రామంలో గాలివానకు తెల్లవారుజామున భారీ వృక్షం నెలకొరిగింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఎగువ సీలేరు టు రాజమహేంద్రవరం బస్సు తెల్లవారుజామున 5గంటలకు సీలేరులో బయలుదేరింది.మంగంపాడు వచ్చేసరికి 5.45 అయింది. జాతీయ రహదారిపై భారీ వృక్షం పడటంతో బస్సులో ప్రయాణికులు చాలా ఇబ్బంది పడ్డారు. ఉద యం వరకు రోడ్డు క్లియరెన్స్ కాలేదు. అనంతరం బస్సు డ్రైవర్ సీహెచ్ రవి, మంగంపాడు గ్రామస్తులకు, సీలేరు సీఆర్పీఎఫ్ జవాన్లకు తెలియజేశారు. గ్రామస్తులు వచ్చి భారీ వృక్షాన్ని తొలగించారు.



రహదారికి అడ్డంగా పడిన చెట్టు

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఏలేరు ఎడమ కాలువ గట్టును బాగుచేయండి

రౌతులపూడి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి గ్రామశివారు ఏలేరు ఎడమ కాలువ గట్టు అధ్వానంగా ఉంది. గోతులు మయంగా మారడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు వచ్చే సమయంలో గోతుల్లో నీరు చేరి పొలాలకు వేళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు ఐదు వందల ఎకరాల జీడిమామిడి తోటలకు ప్రధాన రహదారి. ఎస్సీ కులస్తులకు చెందిన కొండపోడు భూములకు వేళ్లేందుకు ప్రధాన మార్గం కావడంతో ఇబ్బందులు తప్పడంలేదు. కుడి కాలువ గట్టును విశాఖ జీవీఎంసీ అధికారులు బాగు చేశారు. ఎడమ కాలువ గట్టును పట్టించుకోలేదు. ఇప్పటికైనా రైతుల బాధలు దృష్టిలో పెట్టుకుని కాలువ గట్టును బాగుచేయాలని కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న ఏలేరు కాలువ గట్టు

పీఎండీఎస్ విత్తనాలతో భూమి సారవంతం

శంఖవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పంట కాలానికి సంబంధం లేకుండా ప్రధాన పంటకు ముందు పొలాల్లో పీఎండీఎస్ విత్తనాలు చల్లడం ద్వారా నేల సారవంతంగా తయారవ్వడంతో మట్టి కొట్టుకుపోకుండా కాపాడుతుందని ప్రకృతి వ్యవసాయ అధికారి సోమరాజు తెలిపారు. రైతుభరోసా కేంద్రంలో నవధాన్యాల కిట్లను గురువారం తయారుచేశారు. ఈవిధానంలో నువ్వులు, ఉలవలు, మినుములు, పెసలు వంటి పప్పు జాతి విత్తనాలు రైతులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

బడి పిలుస్తోంది కరపత్రం ఆవిష్కరణ

తొండంగి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పెరుమాళ్లపురం ఉన్నత పాఠశాలలో గురువారం బడిపిలుస్తోంది కరపత్రాన్ని ఆవిష్కరించారు. బడిలో నమోదు పెంచేందుకు ఇంటింటి ప్రచారం జరిపేందుకు కరపత్రం రూపొందించినట్లు హెచ్‌ఎం చాట్రాతి సత్యన్నారాయణ తెలిపారు. టీడీపీ నేతలు కాలిబోయిన చంద్రరావు, మహంకాళి, బద్ది రాం బాబు, కొండ బాబు, కొయ్యా లోవరాజు పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

ఏలేశ్వరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం నేతృత్వంలో బాటసారులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామానికి చెందిన వడ్డి క్రిస్టియన్ బాబు ధన సహాయంతో గురువారం మజ్జిగ సమకూర్చారు. సంఘం అధ్యక్షుడు సఖిరెడ్డి విజయబాబు, గోళ్ల నాగేశ్వరరావు, డీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

వృథాగా పోతున్న తాగునీరు



రౌతులపూడి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మూలగపూడి గ్రామంలో పబ్లిక్ కుళాయి నుంచి తాగునీరు వృథాగా పోతుంది. కుళాయికి క్యాప్ లేకపోవడంతో కుళాయి వస్తున్నంత సేపు తాగునీరు వృథాగా పోతుంది. ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో వృథా నీరు రహదారిపైనే ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే వేసవి కాలం కావడంతో తాగునీటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండడం వల్ల నీటి వృథాని అరికట్టాలని ప్రజలు పంచాయితీ అధికారులను కోరుతున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



తుని రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు తెలిపారు. వి.కొత్తూరు, తేటగుంట, కేవో మల్లవరం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. వి.కొత్తూరులో జరిగిన గ్రామసభకు లోవ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు సాధ్యమని, అధికారుల సూచనలతో వ్యవసాయ లాభసాటి చేసుకునే దశగా రైతులు ముందుకెళ్లాలని లోవరాజు కోరారు. కార్యక్రమంలో తమరాన సత్యనారాయణ, తమరాన రామకృష్ణ శ్రీను, రొంగల అబ్బు తదితరులున్నారు.

'ఎస్సీ వర్గీకరణతో ఉప కులాలకు న్యాయం'



ప్రత్తిపాడులో సమావేశమైన దళిత నేతలు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో తీర్మానించి గురువారం రాష్ట్ర కేబినేట్ ఆమోదించడంపట్ల కూటమి ప్రభుత్వానికి ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ దళిత నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ దళిత నాయకుల సమావేశం నిర్వహించారు. దళిత నాయకులు రాజాల చిట్టిబాబు, బొండాడ నారాయణుడు, పలివెల సతీష్, బీజా రాజులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహకారంతో కూటమి ప్రభుత్వం వర్గీకరణకు చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. సమావేశంలో నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు కూడా పాల్గొన్నారు.

దృష్టి లోపం ఉన్నా విద్యా రంగంలో ప్రతిభ



హేమజ్యోతిని అభినందిస్తున్న డీఈవో

తుని రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): దృష్టి లోపం ఉన్నా విద్యా రంగంలో అద్భుత ప్రతిభ కనబరిచిన గింజల హేమ జ్యోతికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఏపీ మోడల్ స్కూల్ హంసవరంలో ఎంఈసీ గ్రూప్ చదివిని గింజల హేమ జ్యోతి దృష్టి లోపం ఉన్నా ఇంటర్ పరీక్షలు మంచిమార్కులతో ప్రతిభ కనబరచడంలో విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఆమెను ప్రత్యేకంగా పిలిపించి అభినందించారు. తాజాగా హంసవరం మోడల్ స్కూల్‌కి డీఈవో చేరుకుని హేమజ్యోతిని అభినందించి, విద్యార్థి తల్లిదండ్రులను సత్కరించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు ఉన్నాయని ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులు సద్వినియోగపరచుకోవాలని కోరారు.

నవీన్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు



టీడీపీ కార్యాలయంలో జ్యోతుల నవీన్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న కూటమి నాయకులు

జగ్గంపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పుట్టినరోజు సందర్భంగా జగ్గంపేట, కిర్లంపూడిల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రామవరంలో వేడుకలు జరిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, పార్టీ మండల అధ్యక్షుడు మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు కలిసి కేక్ కట్ చేశారు. నవీన్ వీరాభిమాని పార్టీ జిల్లా కార్యదర్శి మిండి నరేంద్ర రక్తదానం చేశారు. అనంతరం అనాథలకు, యాచకులకు అన్నదానం నిర్వహించారు.

కిర్లంపూడి: కిర్లంపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, తూము కుమార్, కుర్ల చినబాబు, కాళ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఎంపీపీ తోట రవి, ఏలేరు ప్రాజెక్టు చైర్మన్ బస్వా వీరబాబు, సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



తునిలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న స్టేట్ సివిల్ సప్లయ్ డైరెక్టర్ శివదత్

తుని రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యమని జనసేన సీనియర్ నాయకుడు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ బోడపాటి శివదత్ అన్నారు. తుని రాజా కళాశాల ప్రాంగణంలో టీ20 పవర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు శివదత్ తెలిపారు. ముగింపు వేడుకకు మంత్రులు హాజరవుతారన్నారు. జనసేన నాయకులు దండం రామకృష్ణ, జడ్‌ఆర్‌యూసీ మెంబర్ బోడపాటి శ్రీను, జల్లు సత్యనారాయణ తదితరులున్నారు.

అన్నవరం సర్పంచ్‌కు అరుదైన అవకాశం

16వ ఆర్థిక సంఘ ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న కుమార్‌రాజా

అన్నవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అన్నవరం సర్పంచ్ కుమార్‌రాజాకు అరుదైన గుర్తింపు లభించింది. అమరావతిలో జరిగిన 16వ ఆర్థిక సంఘ ప్రతినిధుల సమావేశంలో రాష్ట్రం నుంచి ఏడుగురు సర్పంచ్‌లకు అవకాశం రాగా వారిలో ఈయన ఒకరు కాగా టీం లీడర్‌గా అవకాశం లభించింది. కేంద ప్రభుత్వం అందించే నిధుల్లో గ్రామ పంచాయతీలకు కేటాయింపు, మౌలిక వసతుల కల్పన తదితర వాటికి నిధులు దీనినుంచే కేటాయిస్తారు. నిధుల కేటాయింపు ప్రస్తుత జనాభా ప్రాతిపదికన కేటాయించాలని కుమార్‌రాజా ప్రతిపాదించడంతో సమావేశానికి హాజరైన ఇతర సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు ఆమోదించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉండాలి

తుని రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని తుని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కె. రాముడు అన్నారు. ప్రజలను చైతన్య పరుస్తూ గురు వారం తుని పట్టణంలో డిమార్టు ప్రాంగణంలో అగ్ని ప్రమాద నివారణ విన్యాసాలు ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది భాస్కరరావు, జీవి రమణ, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

కోటనందూరు, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): వర్షాలతో కాకరాపల్లిలో వరిపంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని తహశీల్దార్ సుభాష్, వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌లకు రైతలు గురువారం వినతిపత్రం అందజేశారు. మండలంలో రబీ వరి పంట 12ఎకరాల్లో నేల మట్టమైందని వారు తెలిపారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

ప్రశాంతంగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రంపచోడవరం ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం మండల ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశం గురువారం ఎంపీపీ బందం శ్రీదేవి అధ్యక్షతన ప్రశాంతంగా జరిగింది. సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయభాస్కర్ హాజరయ్యారు. అన్నిశాఖల అధికారులు మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను తెలియజేశారు. గ్రామాలలో జరిగే అన్ని పనులకు ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని, పంచాయతీ, మండల పరిషత్ తీర్మాణాలు తీసుకోవాలన్నారు. పంచాయతీ విస్తరణాధికారిని కె.ఆర్.యు.ఎల్.పద్మజ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసుదొర ఉన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య

దేవీపట్నం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్య అందిస్తున్నామని దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అందించే విద్యను తెలియజేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



'ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి'

ఎటపాక, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పాలిసెట్ ఎంట్రన్స్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఎటపాక జీఎంఆర్ కళాశాలలో ఇచ్చే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ జమ్ము రామసత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 30న జరిగే పాలిసెట్ ఎంట్రన్స్ పరీ క్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఉచిత శిక్షణతోపాటు ఉచిత స్టడీమెటీరియల్ కూడా పొందవచ్చని సూచించారు.కళాశాలలో ఉద యం 10-30నుంచి మధ్యాహ్నం 1గంటవరకు నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తామన్నారు.

నాటు సారాపై ఉక్కుపాదం

దేవీపట్నం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారు చేసిన, తరలించిన కఠిన చర్యలు తప్పవని దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ తెలిపారు. గురువారం దేవారం గ్రామ శివారున నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారంతో ఒక వ్యక్తి నాటుసారా తయారు చేస్తుండగా పట్టుకొని అతని వద్ద నుంచి 20 లీటర్లు నాటు సారాను సీజ్‌చేసి సుమారు 100 లీటర్లు బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

నంది అవార్డు గ్రహీతకు అభినందన

ప్రత్తిపాడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ధర్మవరానికి చెందిన బొల్లు వెంకటకృష్ణ గంగాధర్ ఇటీవల హైదరాబాద్‌లోని సాంస్కృతిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉగాది నంది పురస్కారం అందుకున్నారు. ఈసందర్భంగా ఆయన్ను కూటమి నాయకులు గురువారం సన్మానించారు. దాట్ల అప్పన్నబాబు, బి.కొండబాబు, బొల్లు వెంకటేశ్వరరావు, ఊటా వీరబాబు, నానిపల్లి శ్రీనివాస్ తదితరులు ఘనంగా సన్మానించారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ధర్మవరానికి చెందిన నొక్కు దావీదు పాము కాటుకు గురవగా ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు గురువారం అతడికి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న ఎస్సీ సామాజికవర్గానికి చెందిన అర్హులు మే 10తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

20లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం మండలం అప్పన్నపాలెంలో సారా అమ్మకాలు నిర్వహిస్తున్న మువ్వల కాటంరాజుపై గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. 20లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని, నిందితుడు పరారీలో ఉండగా గాలింపు చేపడుతున్నామన్నారు.

స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు దరఖాస్తు

అన్నవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావు గురువారం స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా రెండేళ్ల సర్వీస్ ఉండగా ఆయన వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోవడం రత్నగిరిపై చర్చనీయాంశమైంది. వ్యక్తిగత, ఆరోగ్య కారణాల రీత్యా స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేయాలని కుటుంబసభ్యుల సూచనతో దరఖాస్తు చేశానని ఆయన తెలిపారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

గండేపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సుబ్బయ్యమ్మపేట రోడ్డులో సత్తెమ్మ అమ్మవారి గుడి ఎదురుగా గణేష్‌యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. గురువారం పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అక్కిరెడ్డి బాలాజీ, ఆకుల ప్రసాద్, నువ్వుల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'పరీక్షా ఫలితాలపై భయం వీడాలి'

తొండంగి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పరీక్షా ఫలితాలపై విద్యార్థులు భయం వీడాలని కెరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ సత్య స్వరూప అన్నారు. వాకదారిపేట కేజీబీవీ సెంటర్‌లో గురువారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పరీక్షలు, మార్కులే జీవితం కాదని, అంతకంటే విలువైన ఉజ్వల భవిష్యత్తు ఉన్నందున మార్కులు ఎలా వచ్చినా విద్యార్థులు అధైర్యపడకూడదని అన్నారు.

నిందితులను తప్పిస్తే ఉపేక్షించబోం

కొనసాగిన నిరసనలు



నిరసనకారులతో చర్చిస్తున్న అడిషనల్ ఎస్పీ భాస్కరరావు

శంఖవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన కేసులో నిందితులను తప్పించాలని చూస్తే ఉపేక్షించబోమని దళిత సంఘాల నేతలు హెచ్చరించారు. ఈకేసులో కీలక నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినా శాంతించని నిరసనకారులు గురువారం కూడా నిరసన కొనసాగించారు. ఈనిరసనలకు ఇరత ప్రాంతాల నుంచి దళిత సంఘాల నేతలు వచ్చి సంఘీభావం తెలిపారు. నిరసనకారులతో ఏఎస్పీ భాస్కరరావు బృందం చర్చించింది. డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ సూర్యఅప్పారావు, అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు పాల్గొన్నారు.